మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 4-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 336 Issue: 336

Circulated to Telangana
Published from Jagitial

04 జూన్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి ద చవితి రా. 11:29 వరకు తరువాత పంచమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ తె. 3:320 వరకు తరువాత శ్రవణ యోగం శుక్ల ఉ. 8:53 వరకు కరణం బవ ఉ. 10:26 వరకు భాలవ రా. 11:29 వరకు వర్జ్యం ఉ. 9:53 నుండి ఉ. 11:40 వరకు దుర్ముహూర్తం ఉ. 10:04 నుండి ఉ. 10:56 వరకు మ. 3:16 నుండి సా. 4:08 వరకు రాహుకాలం మ. 1:51 నుండి మ. 3:29 వరకు యమగండం తె. 5:44 నుండి ఉ. 7:22 వరకు గుళికాకాలం ఉ. 8:59 నుండి ఉ. 10:37 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు రా. 8:33 నుండి రా. 10:20 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:40 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# అవును.. మా జాగీరే

## పోరాటాలు, ఆత్మబలిదానాలతోనే తెలంగాణ.. పవన్ వ్యాఖ్యలకు గద్దర్ కూతురు కౌంటర్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున పవన్ మాట్లాడిన మాటలు తెలంగాణ అస్తిత్వాన్ని, తన తండ్రి వారసత్వాన్ని అవమానించేలా ఉన్నాయని ఆమె మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "పవనన్న, మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు గౌరవిస్తారు. కానీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీరు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖండిస్తున్నాను" అని వెన్నెల స్పష్టం చేశారు.


అల్వాల్/హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు): "తెలంగాణ మీ జాగీరా అని అడిగారు. అవును, తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరే. ఈరోజు మా జాగీరు. రేపు మా బిడ్డల జాగీరు. ఇది ముమ్మాటికీ మా జాగీరే" అంటూ ఆమె ఘాటుగా బదులిచ్చారు. పైసలు పంచితే, లాబీలు చేస్తే తెలంగాణ రాలేదని, పోరాటాలతో వచ్చిందని అన్నారు. ఎవరినీ బాధపెట్టకుండా, హింసించకుండా, తమకు తాము ప్రాణాలు అర్పించుకుని తెలంగాణ సాధించుకున్నామని అన్నారు. ఇందుకు శ్రీకాంతచారి ఉదాహరణ అని చెప్పారు. పల్లెపల్లెలో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారని అన్నారు. తెలంగాణలో జనసేన పార్టీని విస్తరించి, జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని జూన్ 2న హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరమని, తెలంగాణ ఎవరి జాగీరు కాదని అన్నారు. గద్దర్‌కు తాను వాహనం కొనిచ్చి సహాయం చేశానని గుర్తుచేసుకుంటూ, ఏపీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తానని కూడా తెలిపారు.

# మాడి మసైపోయారు!

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

### విదేశీయులు సహా 21 మంది సజీవదహనం





న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మాలవీయ నగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో మంటలు చెలరేగి 21 మంది సజీవదహనమయ్యారు. బాధితుల్లో ఎక్కువ మంది విదేశీయులే ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి మరో 40 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. లోపల ఇంకొందరు తరువాయి 2 వ పేజీలో...

# దారికొచ్చింది!


## ఎట్టకేలకు జగిత్యాల-కరీంనగర్ హైవేకు మోక్షం

### మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర

### ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల రహదారి విస్తరణ


### రెండు జాతీయ రహదారులకు రూ.7597 కోట్లు

### ఉత్తర తెలంగాణకు గేమ్ ఛేంజర్ అన్న బండి సంజయ్




తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణతో పాటుగా ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో జాతీయ రహదారుల విస్తరణతో పాటుగా కొత్త రహదారుల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

న్యూఢిల్లీ/కరీంనగర్/జగిత్యాల, జూన్ 3 (ఈవార్తలు): తెలంగాణకు సంబంధించి ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల జాతీయ రహదారి (జాతీయ రహదారి 63) విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేషనల్ హైవేను హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో విస్తరించనున్నారు. అలాగే జగిత్యాల-కరీంనగర్ హైవే (జాతీయ రహదారి 563) -2 వ పేజీలో...



# కర్ణాటక సీఎంగా డీకే ప్రమాణం

## హాజరైన రాహుల్, ఖర్గే

### కేబినెట్లో సిద్ధరామయ్య తనయుడికి చోటు

బెంగళూరు: కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణం చేయించారు. డీకే శివకుమార్ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రమాణం చేశారు. ఈ తరువాయి 2 వ పేజీలో...




## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,622 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,938 |

## విశ్వవాణి



మన మెదడు ఒక సజీవమైన, నిరంతరం మారుతూ ఉండే పటం వంటిది. సానుకూల ఆలోచనలు దానిని ఆశ్చర్యకరమైన రీతిలో మళ్లీ రూపుదిద్దగలవు. మీరు జీవితంలోని మంచి విషయాలపై నిరంతరం దృష్టి కేంద్రీకరిస్తే, మీ మెదడులోని నాడుల సంబంధాలు మరింత బలపడతాయి. ఫలితంగా, మీరు మరిన్ని సానుకూల అనుభవాలను గుర్తించడం, వాటిని అన్వేషించడం సులభమవుతుందని తాజా అధ్యయనంలో తేలింది.

# నేడే నైరుతి ఆగమనం

## కేరళ తీరాన్ని తాకనున్న రుతుపవనాలు

కేరళ తీరాన్ని గురువారం నైరుతీ రుతుపవనాలు తాకుతాయని.. 5 తేదీన రాయలసీమలో ప్రవేశిస్తాయని విశాఖ వాతావరణ శాఖ వెల్లడించింది. పదో తేదీకి దక్షిణ కోస్తా అంతటా విస్తరిస్తాయని తావరణ శాఖ అధికారి జగన్నాథ్‌కుమార్ తెలిపారు.



విశాఖపట్నం, జూన్ 3 (ఈవార్తలు): జూన్ 15వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్ మొత్తం రుతుపవనాలు విస్తరించే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. వారం రోజులపాటు సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతలే ఉంటాయని మరో ఐదు రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు ప్రాంతాల్లో కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఏడాది ఎండలు బాగా కాశాయి కాబట్టి వర్షాలు ఎక్కువగా పడతాయని చెప్పలేమని.. కాసిన ఎండలు, వర్షాలకు సంబంధం ఉండదని జగన్నాథ్‌కుమార్ వివరించారు. ఇప్పటికే కేరళంలో తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. కేరళం, తమిళనాడు మీదగా ఏపీలోకి నైరుతి రుతు పవనాలు ప్రవేశించనున్నాయి. రాష్ట్రంలో



# తెలంగాణ ఓజీ.. కేసీఆర్

## పవన్ పెత్తనాన్ని చూస్తు ఊరుకోం.. కావాలంటే ఇంటికొస్తే బిర్యానీ పెడ్తం

### కాంగ్రెస్ పాలనలో రైజింగ్ కాదు.. ఫాలింగ్.. రాష్టానికి అతి పెద్ద శత్రువు కాంగ్రెస్ పార్టీనే

బీఆర్ఎస్‌కు కేసీఆర్ ప్రధాన బలమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలోనే పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడగల నాయకుడు కేసీఆర్ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్టానికి దశాబ్దాలుగా అతిపెద్ద శత్రువుగా అభివర్ణించారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తినే ముఖ్యమంత్రిగా చేసి కాంగ్రెస్ ప్రజలపై రుద్దిందని విమర్శించారు.

హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు):ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తోందని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'తెలంగాణ రైజింగ్' నినాదాన్ని ప్రస్తావిస్తూ, వాస్తవానికి రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడుతోందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన పురోగతి క్రమంగా క్షీణిస్తోందని పేర్కొన్నారు.

### మోదీ-రేవంత్ భాగస్వామ్య ప్రభుత్వం

రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ పరస్పర సహకారంతో పనిచేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీకి వ్యతిరేకంగా తరువాయి 2 వ పేజీలో...

# హీరో ఫ్లెక్స్‌ఫ్యూయల్ బైక్స్ ఎంట్రీ!




ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజిన్ కలిగిన మోటార్ సైకిళ్లను విడుదల చేసింది. ఫ్లెక్స్ ఫ్యూయల్‌కు సపోర్ట్ చేసే స్ప్లెండర్, హెచ్ఎఫ్ డీలక్స్‌ను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది.

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్ సింగ్ పురీ వీటిని ఆవిష్కరించారు. స్ప్లెండర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడల్ ధర రూ. 82,810 (ఎక్స్‌షోరూమ్), హెచ్ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ధర రూ. 72,792 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించారు. ఈ మోడళ్లు ఈ20 నుంచి ఈ85 ఫ్యూయల్‌కు సపోర్ట్ చేస్తాయి. ఇక్కడ ఈ అంటే ఇథనాల్. ఈ20 అంటే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ తరువాయి 2 వ పేజీలో...



# ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధ చట్టాలు సబబే

### చట్టం చేసే అధికారం రాష్ట్రాలకు ఉంది: సుప్రీం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి తరువాయి 2 వ పేజీలో...



# మధుయాష్కీ సతీమణికి తీవ్ర గాయాలు

### అమెరికాలో రోడ్డు ప్రమాదం..విరిగిన రిబ్స్

న్యూయార్క్: మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ భార్య డాక్టర్ సుచియాష్కీ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తమ కుమార్తె డాక్టర్ గగనను ఎండీ కోర్సులో చేర్పించేందుకు బోస్టన్ వెళ్లిన మధుయాష్కీ దంపతులు.. అడ్మిషన్ పూర్తయిన తర్వాత వేర్వేరు కార్లలో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

4.6.2026

మేషం: ఆర్థిక విషయాలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తి కావు. నూతన ప్రయత్నాలు ముందుకు సాగవు. బంధువుల నుంచి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. ప్రయాణాలలో మార్పులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటుంది.

వృషభం: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో కీలక ఆలోచనలు అమలు చేస్తారు. సంతానానికి నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి.

మిథునం: ముఖ్య కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ పరుస్తాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో వాదోపవాదాలకు దిగడం మంచిది కాదు. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు ఉంటాయి.

కర్కాటకం: ప్రయాణాలలో కొత్త పరిచయాలు భవిష్యత్తుకు సహాయపడతాయి. సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు శ్రమతో పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో సేవాకార్యక్రమాలు చేపడతారు. స్థిరాస్తి వివాదాలు పెద్దల సహాయంతో రాజీ చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగాలలో విలువైన పత్రాలు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కన్య: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. ఆత్మీయుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కొన్ని విషయాలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన వాహనయోగం ఉన్నది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి. విద్యార్థుల శ్రమకు తగిన ఫలితం పొందుతారు.

తుల: నిరుద్యోగయత్నాలు కలసివస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వస్తులాభాలు పొందుతారు. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం నుండి కొంత ఉపశమనం పొందుతారు.

వృశ్చికం: మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. దూర ప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణయత్నాలు చేస్తారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగాలలో మీకు రావలసిన గుర్తింపు వేరే వారికి వస్తుంది.

ధనస్సు: దీర్ఘకాలిక ఋణాల ఒత్తిడి పెరుగుతుంది. అనుకున్న పనుల్లో తొందరపాటు నిర్ణయాల వల్ల కొంత చికాకు తప్పదు. ఆరోగ్యసమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్పదు. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది.

మకరం: నూతన పరిచయాలు సంతోషాన్నిస్తాయి. సంఘంలో విశేష గౌరవ మర్యాదలు పెరుగుతాయి. స్థిరాస్తి ఒప్పందాలు అనుకూలిస్తాయి. గృహమున బందు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

కుంభం: ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి ధన సహాయం అందిస్తారు. చేపట్టిన పనులు చకచకా పూర్తి చేస్తారు. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మీనం: సన్నిహితులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వల్ల కొంత చికాకు పెరుగుతుంది. పని ఒత్తిడి అధికమై శిరో బాధలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

# దారికొచ్చింది!



మొదటి పేజీ తరువాయి

విస్తరణకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ జాతీయ రహదారిని బీవోటీ పద్ధతిలో విస్తరించనున్నారు. ఈ రెండు జాతీయ రహదారులను 190 కిలోమీటర్ల మేరకు నాలుగు వరుసలగా విస్తరించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.7,597 కోట్లు ఖర్చు చేయనుంది. మరోవైపు జూన్ నెల ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు భారీ కానుక ప్రకటించిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం.. ఉత్తర తెలంగాణ కోసం రూ.7597 కోట్లతో రహదారి ప్రాజెక్టును మంజూరు చేసిందని తెలిపారు. జాతీయ రహదారి-63, జాతీయ రహదారి-563ను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. రూ.2472 కోట్లతో ఆర్మూర్ - జగిత్యాల మధ్య 63.6 కిలోమీటర్ల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. అలాగే జగిత్యాల - మంచిర్యాల మధ్య 68.3 కిలోమీటర్ల మేరకు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తారని.. ఇందుకోసం రూ. 2731 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. రూ.2395 కోట్లతో జగిత్యాల - కరీంనగర్ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు తెలిపారు. రాబోయే దశాబ్దాల పాటు తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా.. మౌలిక సదుపాయాల రంగంలో ఇదొక విప్లవాత్మకమైన ముందడుగుగా బండి సంజయ్ అభివర్ణించారు. తెలంగాణకు ఈ చరిత్రాత్మక కానుకను అందించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలియజేశారు. నా కరీంనగర్. నా తెలంగాణ. గర్వంతో ముందుకు సాగుతోందంటూ బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేశారు.

విమాన ఇంధన ధరల స్థిరత్వానికి రూ.10 వేల కోట్ల నిధి

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విమాన ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ విమానయాన రంగానికి, ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 'విమాన ఇంధన ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటు నిర్ణయానికి ఆమోదం లభించింది. ఈ ఇంధన నిధి కోసం రూ.10,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో విమాన ఇంధనం ధరలు పెరిగినప్పుడు ఆ భారం విమానయాన సంస్థలపై పడకుండా చమురు మార్కెటింగ్ సంస్థలకు ప్రభుత్వం ఈ నిధి నుంచి ఆర్థికసాయం అందిస్తుంది. ఇది వడ్డీలేని అడ్వాన్స్ రూపంలో అందుతుంది. దీనివల్ల ఇంధన ధరలు పెరిగినా చమురు సంస్థలు విమానయాన సంస్థలకు స్థిరమైన ధరలకే ఇంధనాన్ని సరఫరా చేయడానికి వీలవుతుంది. ఈ ఇంధన నిధి కోసం ఓ ప్రత్యేకమైన రికవరీ విధానాన్ని రూపొందించారు. అంతర్జాతీయ మార్కెట్లో విమాన ఇంధన ధరలు తగ్గినప్పుడు ఆ మొత్తాన్ని చమురు సంస్థల నుంచి ప్రభుత్వం తిరిగి వసూలు చేస్తుంది. ఆ సొమ్మును 'కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా' కు జమ చేస్తారు. ఇలా నిధులు పూర్తిగా వసూలయ్యే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విమాన ఇంధనం ధర 2026 మార్చిలో లీటరు రూ.60.50 ఉండగా.. మే నాటికి ఏకంగా రూ.142 కు పెరిగింది. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ ఖర్చులలో ఇంధనానికే 40 నుంచి 60 శాతం వరకు ఖర్చవుతుంది. పాకిస్థాన్ గగనతలం మూతపడటంతో విమానాలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ కొత్త నిధివల్ల ఇంధన ధరలు అదుపులో ఉండి ప్రయాణికులపై టికెట్ ధరల భారం పడకుండా ఉంటుంది. ఈ పథకం కింద విమానయాన సంస్థలు, చమురు సంస్థల మధ్య ఓ అవగాహన ఒప్పందం కుదురుతుంది. దీని ప్రకారం విమానయాన సంస్థలు రాబోయే 36 నెలలపాటు కేవలం ఈ చమురు సంస్థల నుంచే ఇంధనాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంవల్ల దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలకు విమాన సర్వీసులు నిరంతరాయంగా కొనసాగుతాయి. అలాగే విమానయాన రంగంపై ఆధారపడిన లక్షలాది ఉద్యోగాలకు రక్షణ ఉంటుంది.

# కర్ణాటక సీఎంగా డీకే ప్రమాణం


మొదటి పేజీ తరువాయి

కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు. డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక కొత్త మంత్రివర్గంలో 12 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ, "సోనియా గాంధీ నాతో ఫోన్‌లో మాట్లాడారు. మొదటి నుంచి నాపై ఆమెకు చాలా నమ్మకం ఉంది. నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది సోనియానే. అందరినీ కలుపుకుని పనిచేయాలని ఆమె సూచించారు. ఆమె నమ్మకాన్ని నిలబెడతానని, అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని నేను హామీ ఇచ్చాను" అని వివరించారు.

# మాడి మసైపోయారు!

మొదటి పేజీ తరువాయి

చిక్కుకున్నట్టు సమాచారం. ప్రమాదం నుంచి కాపాడుకొనేందుకు పైఅంతస్తుల్లో ఉన్నవారు కిటికీలు, బాల్కనీల నుంచి కిందకు దూకారు. హౌజ్‌రానీలోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 8.50 గంటల సమయంలో బేస్‌మెంట్‌లో తొలుత మంటలు చెలరేగి పైఅంతస్తులకు వ్యాపించాయి. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపుచేస్తూ.. లోపలి చిక్కుకున్నవారిని రక్షించేందుకు ప్రయత్నించారు. గాయపడినవారిని చికిత్సకోసం సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రత్యక్ష సాక్షి ఒకరు మాట్లాడుతూ.. ముందుగా చిన్నగా మొదలైన మంటలు వేగంగా పైకి వ్యాపించాయని, దీంతో లోపల చిక్కుకున్నవారు బయటకు వచ్చే మార్గం లేకుండా పోయిందన్నారు. కిటీకీల నుంచి పలువురు కిందికి దూకారని, వారికి ఎలాంటి దెబ్బలు తగలకుండా స్థానికులు పరుపులను కిందవేశారని చెప్పారు. ఒక మహిళ చిన్నారితో సహా మూడో అంతస్తు నుంచి కిందికి దూకిందని వివరించారు. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, వెంటనే మిగతా



సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఆ రెస్టారెంట్ చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. బయటకు వచ్చిచూసేసరికి భవనం మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. ఈ హోటల్‌లో బసచేసినవారిలో ఎక్కువ మంది సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం వచ్చినవారేనని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగే సమయానికి బాధితులు నిద్రలో ఉండటం వల్ల ప్రాణనష్టం అధికంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రాణాలు కాపాడుకోడానికి పలువురు భవనంపై నుంచి దూకుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయనేది ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఫ్లోరిష్ స్టేకు ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ కాన్సెప్ట్ కింద లైసెన్స్ మంజూరు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, కేవలం ఆరు గదులకు మాత్రమే అనుమతి ఉంది. కానీ, బేస్‌మెంట్‌లోని గదులు సహా ఆ హోటల్ 25 గదులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. హోటల్ అగ్నిమాపక శాఖ నుంచి సేఫ్టీ సర్టిఫికెట్ పొందిందా లేదా అనేది అధికారులు ధ్రువీకరించనున్నారు. అంతేకాకుండా, ఆ హోటల్‌కు ఎంట్రీ, ఎగ్జిట్‌కు ఒకటే మార్గం ఉందని, దీనివల్ల ప్రమాద తీవ్రత ఎక్కువైందని అన్నారు.

# మధుయాష్కీ సతీమణికి తీవ్ర గాయాలు

మొదటి పేజీ తరువాయి

న్యూయార్క్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సుచియాష్కీ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. వర్షం కురుస్తుండటంతో వాహనం అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెకు పక్కటెముకలు విరిగినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం న్యూయార్క్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని వెల్లడించారు. అయితే, ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మధుయాష్కీ తనయ డాక్టర్ గగన యాష్కి న్యూయార్క్ మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. కాలేజీలో జరిగే కాన్వకేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇటీవల మధుయాష్కి అమెరికా వెళ్లారు. ఈ క్రమంలో తన కుమార్తెను బోస్టన్ మెడికల్ కాలేజీలో ఎండీ కోర్సులో చేర్పించారు. అక్కడకు వెళ్లిన తర్వాత లగేజీ ఎక్కువ ఉండటంతో.. భార్య సూచి యాష్కీ, మధుయాష్కి వేర్వేరు కార్లలో బయలుదేరారు. మార్గమధ్యంలో భారీ వర్షం కారణంగా కారు అదుపుతప్పి బోల్తాపడి ప్రమాదం జరిగింది.

# నేడే నైరుతి ఆగమనం

మొదటి పేజీ తరువాయి

ఎండలు తగ్గుముఖం పట్టాయి. కావలిలో 42.6 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైంది. తీరం వెంబడి బలమైన గాలులు, భీమిలిలో 2 సెం.మీ వర్షపాతం నమోదైంది.

### తెలంగాణకు భారీ వర్ష సూచన

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# తెలంగాణ ఓజీ.. కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

నిలబడడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. రైతు డిస్కం పేరుతో కొత్త విధానాలను తీసుకువస్తున్న ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు భంగం కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తోందని, ఆర్‌బీఐ నివేదికలు వాస్తవ పరిస్థితిని వెల్లడించాయని పేర్కొన్నారు.

### ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 90 సీట్లు



రాష్ట్రంలో ఇప్పుడే ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు 90కిపైగా అసెంబ్లీ స్థానాలు వస్తాయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓటమి చెందుతారని వ్యాఖ్యానించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో ఉప ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో మరింత మమేకం కావడానికి 2027లో పాదయాత్ర చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు కేటీఆర్ వెల్లడించారు. బీజేపీతో పొత్తుపై జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా ఖండించారు. అటు.. ఉగ్రవాదం కంటే ప్రాంతీయవాదం ప్రమాదకరమని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు ఉద్యమాన్ని కూడా ప్రాంతీయవాదంగా పరిగణిస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం త్యాగాలు, పోరాటాల ఫలితమని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలకు దేశభక్తి కొత్త కాదని, జాతీయ భావన గురించి ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. పవన్ కల్యాణ్‌ను నటుడిగా అభిమానిస్తామని, కానీ తెలంగాణపై పెత్తనం చేయాలనే ధోరణిని అంగీకరించబోమని వ్యాఖ్యానించారు. జనసేన సభకు అనుమతి నిరాకరించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేసిన కేటీఆర్, పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర ఉండొచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేశారు.

### కాంట్రాక్టుల కేటాయింపుపై ప్రశ్నలు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వకూడదని మాట్లాడుతున్న మంత్రులు, దానికి సంబంధించిన చట్టాన్ని అసెంబ్లీలో తీసుకురావాలని కేటీఆర్ సవాల్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంస్థలకే వెళ్తున్నాయని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన విమర్శలు సమంజసమేనని కేటీఆర్ అన్నారు. ఈ ప్రాజెక్టు వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయాలన్నింటినీ సమీక్షిస్తామని స్పష్టం చేశారు. సెక్రటేరియట్ ముందు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని ప్రస్తావించిన కేటీఆర్, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్‌కు సంబంధించిన విగ్రహాలను గాంధీభవన్‌కు తరలిస్తామని వ్యాఖ్యానించారు. తెలంగాణకు బీజేపీ గణనీయమైన ప్రయోజనం చేకూర్చలేదని కేటీఆర్ అన్నారు. గతంలో హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తూ, భవిష్యత్తులో అలాంటి చర్యలు జరిగితే బీఆర్ఎస్ నేతృత్వంలో మరో ఉద్యమం వస్తుందని హెచ్చరించారు.

# హీరో ఫ్లెక్స్‌ఫ్యూయల్ బైక్స్ ఎంట్రీ!

మొదటి పేజీ తరువాయి

కలుపుతారు. ప్రస్తుతం కొన్ని పెట్రోల్ పంపుల వద్ద ఈ20 పెట్రోల్ లభిస్తోంది. బీఎస్6 మోడళ్లు చాలా వరకు ఈ20కి సపోర్ట్ చేస్తున్నాయి. ఇక ఈ85 అంటే 85 శాతం ఇథనాల్, 15 శాతం మాత్రమే పెట్రోల్ ఉంటుంది. వినియోగదారులు ఏ తరహా పెట్రోల్ వేసినా ఈ మోటార్ సైకిళ్లు నడుస్తాయి. తొలి దశలో ఢిల్లీ, మహారాష్ట్రలో హీరో మోటార్ సైకిళ్లు అందుబాటులోకి తేనున్నారు. జులై నుంచి మార్కెట్‌లో లభిస్తాయి. రాబోయే రెండేళ్లలో మిగిలిన మోడళ్లను కూడా ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇంజిన్‌లుగా మారుస్తామని హీరో మోటోకార్ప్ తెలిపింది.

# ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధ చట్టాలు సబబే

మొదటి పేజీ తరువాయి

యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొన్నది. ఆన్‌లైన్ వ్యసనాలవల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# కేటీఆర్ తప్పుగా మాట్లాడరు: పవన్

అమరావతి, జూన్ 3 (ఈవార్తలు): తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను ఉద్దేశించి ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేసి ఉండరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తనకు కేటీఆర్‌తో మంచి సోదరభావ సంబంధం ఉందని, అనేక సందర్భాల్లో ఇద్దరం కలిశామని, తమ మధ్య పరస్పర ఇష్టాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా, కేటీఆర్ వ్యాఖ్యల గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు పవన్ ఈ విధంగా స్పందించారు. "కేటీఆర్ గారు ఏమన్నారో నేను పూర్తిగా చూడలేదు. కానీ, నాకు తెలిసి ఆయన పొరపాటు మాటలు మాట్లాడరు. బహుశా ఆయన నా పూర్తి వ్యాఖ్యలు చూడలేదేమో. ఆయన ఒక సరైన దృక్పథంతోనే మాట్లాడి ఉంటారని అనుకుంటున్నా. కొన్నిసార్లు విషయాలను చిలికి చిలికి గాలివానలా మారుస్తుంటారు. దీనిపై అంతకుమించి ఏమీ లేదు" అని పవన్ కళ్యాణ్ వివరించారు. విధానపరమైన అంశాల్లో భేదాభిప్రాయాలు ఉండటం సహజమని, అయితే తమ వ్యక్తిగత సంబంధం వేరని ఆయన పేర్కొన్నారు. ఈ వివాదంపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని, తామిద్దరం ఎప్పుడైనా కలిసినప్పుడు దీని గురించి సరదాగా మాట్లాడుకుంటామని పవన్ కల్యాణ్ తేలికగా వ్యాఖ్యానించారు.

**కులాలతో బాగుపడ్డది నాయకులే**

రాష్ట్రంలో కుల సంఘాలు ఏర్పాటు చేసుకుని వాటి నాయకులు బాగుపడ్డారేమో కానీ, ఆయా కులాల ప్రజలు మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా తీవ్రంగా నష్టపోతున్నారని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కులాల పేరుతో జరుగుతున్న రాజకీయాలకు చరమగీతం పాడాలని, కులాల ఐక్యతే తమ పార్టీ మూల సిద్ధాంతమని స్పష్టం చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పవన్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు



కారణమైన పొట్టి శ్రీరాములు వంటి మహనీయుడిని సైతం ఒక కులానికే పరిమితం చేసే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు, కుల దూషణలు పరాకాష్టకు చేరాయని పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 1998 నుంచి మొదలైన ఈ ధోరణి, వైసీపీ పాలనలో జర్నలిస్టులను సైతం కులం పేరుతో దూషించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఒక ఎమ్మెల్సీ, దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేస్తే, అధికార పార్టీ నేతలు హంతకుడిని వెనకేసుకొచ్చారని, అప్పుడు దళిత సంఘాలు సైతం మాట్లాడలేని పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. అలాగే కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి, ఆయన మరణానికి కారణమైనా ఏ సంఘాలు నోరు మెదపలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కుల సంఘాలు మౌనంగా ఉండిపోవడం వల్లే నాయకులు బాగుపడుతున్నారని, ప్రజలు మాత్రం నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. కుల నిర్మూలన అనే అంబేద్కర్ ఆశయం సాధ్యమో కాదో తెలియదు కానీ, కులాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం నేటి సమాజానికి అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ సమస్యతో బాధపడుతుంటే, వాటిని పక్కనపెట్టి కేవలం కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ కుల రాజకీయాలకు ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని తమ పార్టీ నిర్ణయించుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన తరఫున గెలిచిన 54 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు వేర్వేరు కులాలకు చెందినవారేనని, అందరి సహకారంతోనే గెలుపు సాధ్యమైందని గుర్తు చేశారు. ఇకపై ఆంధ్రప్రదేశ్‌లో కులాల ఐక్యతను ప్రోత్సహిస్తూ, అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు శ్రీకారం చుడతామని జనసేన నాయకత్వం సమిష్టిగా నిర్ణయం తీసుకున్నట్లు పవన్ ఈ సందర్భంగా ప్రకటించింది.

**తెలంగాణ ఉంది..'ఆంధ్రా'నే లేదు**

తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే బలమైన ఐక్యతా భావన ఉందని, దాన్ని చూస్తే తనకు ముచ్చట వేస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి ఉమ్మడి భావన కొరవడిందని, ఇక్కడ ఐక్యతకు బదులుగా ఉప ప్రాంతీయతలు, కులాల ప్రాబల్యం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 'తెలంగాణ ప్రజలను చూస్తే ఎందుకు ముచ్చటేస్తుందంటే, వారిలో తెలంగాణ అనే భావన ఉంటుంది. తమిళులకు వారి భాషా, ప్రాంతంపై అభిమానం ఉంటుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో 'ఆంధ్రా' అనే ఉమ్మడి భావన కొరవడింది. ఇక్కడ సబ్-రీజనలిజం, కులతత్వమే ఎక్కువ' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను 'జై ఆంధ్ర' అని నినాదం ఇచ్చింది కూడా అందుకేనని పవన్ స్పష్టం చేశారు. కనీసం 'మేమంతా ఆంధ్ర' అనే ఒక ఉమ్మడి గుర్తింపు రాష్ట్ర శ్రేయస్సు కోసం అవసరమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తన సూచనను ఉన్మాద స్థాయికి తీసుకెళ్లమని కాకుండా, రాష్ట్రం కోసం కనీస ఐక్యతను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ మాట చెప్పానని వివరించారు. ఈ రకమైన ఉప ప్రాంతీయతలతో రాష్ట్రం ఇప్పటికే అన్ని రకాలుగా విడిపోయిందని, ఇకనైనా కలపడానికే ప్రయత్నించాలని ఆయన అన్నారు.



# కొంపల్లికి కేఫ్ నిలోఫర్

అల్వాల్, జూన్ 3 (ఈవార్తలు): హైదరాబాద్ నగరవాసుల టీ సంస్కృతిలో దశాబ్దాలుగా భాగమైపోయిన ప్రఖ్యాత 'కేఫ్ నిలోఫర్' ఇప్పుడు తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. నగరంలోని కొంపల్లిలో అత్యంత భారీ, కొత్త ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇరానీ చాయ్, బన్ మస్కా వంటి తమ ప్రత్యేక రుచులను ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకు సిద్ధమైంది. కొంపల్లిలోని 'ఫెయిర్‌మౌంట్ డౌన్‌టౌన్' కమర్షియల్ కాంప్లెక్స్‌లో సుమారు 36,000 చదరపు అడుగుల విశాలమైన స్థలాన్ని కేఫ్ నిలోఫర్‌కు లీజుకు ఇచ్చినట్లు ఫెయిర్‌మౌంట్ బిల్డర్స్ ప్రకటించింది. ఇప్పటికే హైటెక్ సిటీలో ఉన్న ఫ్లాగ్‌షిప్ బ్రాంచ్ తరహాలోనే ఈ కొత్త ఔట్‌లెట్‌ను కూడా మల్టీ-లెవల్ ప్రీమియం లాంజ్‌గా తీర్చిదిద్దనున్నారని సమాచారం. దీని ద్వారా సంప్రదాయ టీ అనుభవాన్ని ఒక విలాసవంతమైన జీవనశైలికి అనుగుణంగా మార్చనున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఒక చిన్న కేఫ్‌గా ప్రారంభమైన నిలోఫర్, నేడు హైదరాబాద్ సాంస్కృతిక చిహ్నంగా మారింది. 2025లో హైటెక్ సిటీలో దాదాపు 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద టీ కేఫ్‌ను ప్రారంభించి నిలోఫర్ వార్తల్లో నిలిచింది. ఈ విస్తరణతో సెంట్రల్, వెస్ట్రన్ హైదరాబాద్‌లకు మాత్రమే పరిమితమైన నిలోఫర్, ఇప్పుడు నగరంలోని ఇతర ప్రాంతాలకూ చేరువవుతోంది. అయితే, ఈ విస్తరణపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొంపల్లి, దాని పరిసర ప్రాంతాల ప్రజలు కొత్త ఔట్‌లెట్ రాకపై సంతోషం వ్యక్తం చేస్తుండగా, పాత కస్టమర్లు మాత్రం పెరుగుతున్న ధరలపై సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఔట్‌లెట్లలో మౌలిక సదుపాయాలు, సేవలకు అనుగుణంగా ధరలు పెంచినప్పటికీ, పాత రుచుల స్ఫూర్తిని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని యాజమాన్యం చెబుతోంది. ఈ కేఫ్ ప్రారంభ తేదీని ఇంకా ప్రకటించవలసి ఉంది.

# రేపటి నుంచి భూములకు కొత్త రేట్లు

**భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ**

**పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు**

**శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించాం: పొంగులేటి**

హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు): తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు. కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు. ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# అసలైన ప్రాంతీయవాదం ఆంధ్రాలోనే: నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు): ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయవాదం. ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే, మొదట మీరే ఉగ్రవాదులు అవుతారు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాటి రాచరికపు పాలన అంతమై, తెలంగాణ భారతదేశంలో విలీనం కావాలని ప్రాణాలర్పించి పోరాటం చేసిన జాతీయవాదులు తమ తెలంగాణ ప్రజలని నిరంజన్ రెడ్డి అన్నారు. నాటి కాలంలో తమను బలవంతంగా ఆంధ్ర ప్రాంతంతో విలీనం చేశారని.. ఆ తర్వాత జరిగిన అన్యాయాలు, దుర్మార్గాల నుంచి విడిపోవాలనే ఇక్కడి ప్రజలు పోరాడారు తప్ప, తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కారని ఆయన తేల్చి చెప్పారు. పక్క రాష్ట్రాల నాయకులు వచ్చి మన గడ్డపై నిలబడి తెలంగాణ సమాజాన్ని వెక్కిరిస్తుంటే.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు పెద్ద ద్రోహి అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించిన తీరును అభినందించిన ఆయన.. మిగతా మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. "తెలంగాణ మంత్రుల నోళ్లకు ఏమైనా పక్షవాతం వచ్చిందా?" అని ఘాటుగా ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య ఎన్ని రాజకీయ విభేదాలైనా ఉండొచ్చని.. కానీ, పొరుగు రాష్ట్రాల నేతలు వచ్చి తెలంగాణను అవమానిస్తుంటే అందరూ ఏకతాటిపైకి వచ్చి ఖండించకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేసిన ఆయన.. ప్రభుత్వ వైఫల్యాలను, తెలంగాణకు జరుగుతున్న అవమానాలను సోషల్ మీడియా వేదికగా గట్టిగా ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

# అమరావతి, డీఎస్సీపై జగన్ కమిటీలు

తాడేపల్లి, జూన్ 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. అమరావతి ప్రాంతంలో పార్టీ తరఫున కార్యాచరణను పటిష్టం చేసేందుకు, అదే సమయంలో న్యాయపరమైన అంశాలను ఎదుర్కొనేందుకు వీలుగా రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. అమరావతి పరిధిలో రైతుల సమస్యలు, ప్రాంతీయ పరిణామాలను పర్యవేక్షించేందుకు 8 మంది సభ్యులతో కూడిన 'రైతు పరిరక్షణ కమిటీ'ని వైఎస్సార్సీపీ నియమించింది. ఈ కమిటీలో కమిటీలో వైఎస్సార్సీపీ సీనియర్ నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్, నందిగం సురేశ్, అప్పిరెడ్డి, అరుణ్ కుమార్, వజ్రబాబు సభ్యులుగా ఉన్నారు. ఇక అమరావతి రాజధాని వ్యవహారాలకు సంబంధించిన వివాదాలపై కోర్టులలో పార్టీ తరఫున వాదనలు బలంగా వినిపించేందుకు, చట్టపరమైన చర్యల కోసం లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక 'న్యాయపోరాట కమిటీ'ని కూడా నియామకం చేసింది. ఇందులో సభ్యులుగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మనోహర్



రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కిషోర్ ఉంటారు. రాజధాని ప్రాంతంలో క్షేత్రస్థాయిలో రైతుల పక్షాన నిలబడటంతో పాటు, ఇటు న్యాయస్థానాల్లో కూడా గట్టిగా పోరాడేందుకు వీలుగా వైసీపీ ఈ వ్యూహాత్మక కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. చివరగా.. ఐదుగురు సభ్యులతో డీఎస్సీ పోరాట కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా అప్పిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కల్పలత, చైతన్య, రవిచంద్ర ఉంటారని వైసీపీ రాష్ట్ర అధినాయకత్వ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

**అధికారంలోకి వచ్చాక డీఎస్సీపై విచారణ కమిషన్**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ - 2025పై సీబీఐ విచారణకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిపించి, అన్నింటా సక్సెస్ అయిన అనేక మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు రాకపోవడం అత్యంత హేయమని మండిపడ్డారు. పలువురు డీఎస్సీ అభ్యర్థులతో వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. డీఎస్సీపరీక్ష నిర్వహణ, ఎంపికలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా జీవోలు జారీ చేసి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చారని, దీంతో ఎంతోమంది అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. వారి తరఫున వైసీపీ న్యాయ పోరాటం చేస్తుందని.. ఇందుకోసం లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే వైసీపీ పార్టీ అధికారంలోకి రాగానే, విచారణ కమిషన్ ఏర్పాటు చేసి.. ఈ అక్రమాలపై దర్యాప్తు జరుపుతామని, అన్యాయానికి గురైన అభ్యర్థులకు అవసరమైతే అదనపు పోస్టులు ఇస్తామని జగన్ ప్రకటించారు.

# కోటి మందితో యోగాంధ్ర: చంద్రబాబు

అమరావతి, జూన్ 3 (ఈవార్తలు): ఏపీ వ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు.



ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఆ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఎశీస్త్రుఖఅస్ప్రతీఘ.ఖజూ.స్త్రశీజ.అఅ పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

# ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!

**తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్ ఈసీ అలర్ట్**

**15 నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సవరణ**

హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు): హైదరాబాద్ సహా తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) తమ ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. మొబైల్ నంబర్ లింక్ లేకపోతే, ఎన్నారైలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమర్పించడం సాధ్యం కాదని, ఓటర్ల జాబితాలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు తెలిపారు. ఎన్నారైలు తమ మొబైల్ నంబర్‌ను లింక్ చేయడానికి ఈసీఐ అధికారిక పోర్టల్‌ను సందర్శించాలి. అక్కడ ఫారం 8 (ప్రస్తుత ఓటర్ల జాబితాలో వివరాల సవరణ)ను పూర్తి చేయాలి. మొబైల్ నంబర్ నమోదు చేశాక వచ్చే ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి అని, ఫారం సమర్పించేటప్పుడు ఆధార్ అథెంటికేషన్ అవసరమని అధికారులు నొక్కిచెప్పారు. తెలంగాణలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీని ప్రకారం, జూన్ 15 నుంచి 24 వరకు ఓటర్ల జాబితా రూపకల్పన, జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు స్వీకరించి, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, తమ ఓటు హక్కును కాపాడుకోవాలనుకునే ప్రవాస భారతీయులకు ఈ ప్రక్రియ చాలా కీలకం. నిర్ణీత గడువులోగా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా వారు తమ రాష్ట్రంలోని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా కొనసాగవచ్చు.


**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




# సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

**రాష్ట్రంలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు**

**పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ**

హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు): తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

# ఏపీలో ఐదు రోజులు వర్షాలు

విశాఖపట్నం, జూన్ 3 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రాబోయే 24 గంటల్లో ఈ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించనున్నట్లు అధికారులు వెల్లడించారు. తద్వారా ఇవి క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నాయి. గురువారం నాటికి నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్ర ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళతో పాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల వాతావరణం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో.. మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది.

# బెంగళూరుకు డీకే వరాల జల్లు

**రోడ్ల అభివృద్ధికి 2000 కోట్లు కేటాయింపు**



బెంగళూరు: కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే డీకే శివకుమార్ కీలక నిర్ణయాలతో పాలనలో తనదైన ముద్ర వేశారు. సిద్ధరామయ్య రాజీనామా అనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన, ముఖ్యంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వరాల జల్లు కురిపించారు. ఇవాళ (జూన్ 3న) బెంగళూరులోని లోక్ భవన్ గ్లాస్ హౌస్‌లో పార్టీ నేతలు, మత పెద్దల సమక్షంలో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ఆయన సీఎంగా ప్రమాణం చేశారు. అధికారంలోకి వస్తూనే, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు అందిస్తామని తొలి కీలక ప్రకటన చేసి విద్యార్థులకు శుభవార్త అందించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా, బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో డీకే శివకుమార్ 'బ్రాండ్ బెంగళూరు' నినాదంతో ముందుకు వెళ్తున్నారు. నగరంలో దీర్ఘకాలంగా ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.

# హోమియోపతి బెటర్: అనుష్క శర్మ



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి అనుష్క శర్మ హోమియోపతి వైద్య విధానానికి మద్దతుగా ఆమె చేసిన ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ దుమారానికి కారణమైంది. బుధవారం ఆమె చేసిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి వాదిస్తున్నారు. ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ రాజన్ శంకరన్‌కు సంబంధించిన ఒక వీడియోను అనుష్క తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఈ సందర్భంగా హోమియోపతితో తనకున్న అనుబంధాన్ని ఆమె పంచుకున్నారు. "నా జీవితంలో హోమియోపతీ కీలక పాత్ర పోషించింది. ఈ ప్రయాణంలో డాక్టర్ రాజన్ శంకరన్ ముఖ్యమైన భాగస్వామి. ఆరోగ్యం, జీవనశైలిపై ఆయన అభిప్రాయాలను నేను ఎంతో గౌరవిస్తాను" అని ఆమె పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె పోస్ట్ చేసిన కొద్దిసేపటికే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కోట్లాది మంది ఫాలోవర్లు ఉన్న సెలబ్రిటీలు వైద్య చికిత్సల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, శాస్త్రీయత లేని వైద్య విధానాన్ని ప్రోత్సహించడం బాధ్యతారాహిత్యమని పలువురు విమర్శించారు. మరికొందరైతే, అనుష్క ఇలాంటి వాటిని ప్రోత్సహించడం చూసి ఆమె ఫ్యాన్‌గా వైదొలగుతున్నామని కామెంట్స్ పెట్టారు. అయితే, మరికొందరు అనుష్కకు మద్దతుగా నిలిచారు. వైద్యం అనేది వ్యక్తిగత ఎంపిక అని, తనకు నమ్మకం ఉన్న దాని గురించి చెప్పడంలో తప్పేమిటని ప్రశ్నించారు. అల్లోపతిలో తగ్గని దీర్ఘకాలిక సమస్యలకు హోమియోపతితో పరిష్కారం దొరికిందని కొందరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ వివాదంపై అనుష్క శర్మ ఇప్పటివరకు స్పందించలేదు. ఇటీవలే అనుష్క, విరాట్ కోహ్లీ దంపతులు బృందావన్‌లోని ప్రేమానంద్ మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించడం కూడా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

# కాంగ్రెస్‌కు టీవీకే రాజ్యసభ సీటు

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానాన్ని కేటాయించింది. జూన్ 18న జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి ఖాళీగా ఉన్న ఏకైక రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు ఇస్తున్నట్లు టీవీకే అధినేత, ముఖ్యమంత్రి విజయ్ బుధవారం ప్రకటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అన్నాడీఎంకే నేత సి.వి. షణ్ముగం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచినా, సాధారణ మెజారిటీకి కొద్ది దూరంలో ఆగిపోయింది. దీంతో కాంగ్రెస్, వీసీకే వంటి మిత్రపక్షాల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డీఎంకేతో పొత్తును వీడి టీవీకేకు మద్దతు పలికిన కాంగ్రెస్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకే విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ డేటా అనలిటిక్స్ విభాగానికి ఛైర్మన్‌గా ఉన్న ప్రవీణ్ చక్రవర్తి పేరు బలంగా వినిపిస్తోంది. ఆయన రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం సీఎం విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ కావడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. టీవీకే, దాని మిత్రపక్షాల ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు లాంఛనప్రాయమే కానుంది. అభ్యర్థి ఎవరనే దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ కేటాయింపుతో ప్రభుత్వ స్థిరత్వాన్ని కాపాడుకుంటూనే, కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎగువ సభలో ప్రాతినిధ్యం కల్పించినట్లవుతుంది.




# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్?

న్యూఢిల్లీ: భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించనుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది. ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

# మలక్కా జలసంధిపై భారత్ పట్టు!



**గ్రేట్ నికోబార్ దీవిలో 9 బిలియన్ డాలర్ల వ్యయంతో ప్రాజెక్ట్.. చైనా వాణిజ్య, చమురు రవాణాకు కీలకమైన మార్గంపై నిఘా**

న్యూఢిల్లీ: ప్రపంచ వాణిజ్యంలో ఇరాన్‌కు హర్మూజ్ జలసంధి ఎంత కీలకమో, హిందూ మహాసముద్రంలో మలక్కా జలసంధి కూడా అంతే వ్యూహాత్మకమైనది. ఇప్పుడు ఆ జలసంధిపై పట్టు సాధించి, ఇండో-పసిఫిక్‌లో చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ ఓ భారీ ప్రణాళికతో ముందుకెళుతోంది. ఇందులో భాగంగా అండమాన్ నికోబార్ దీవుల్లోని గ్రేట్ నికోబార్ దీవిలో సుమారు 9 నుంచి 11 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో మెగా అభివృద్ధి ప్రాజెక్టును వేగవంతం చేసింది. భారత ప్రధాన భూభాగానికి 1,600 కిలోమీటర్ల దూరంలో, మలక్కా జలసంధికి అత్యంత సమీపంలో ఉన్న ఈ దీవిలో అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, సైనిక-పౌర అవసరాలకు ఉపయోగపడే విమానాశ్రయం, విద్యుత్ కేంద్రం, భారీ టౌన్‌షిప్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ వాణిజ్యంలో మూడింట ఒక వంతు, చైనా ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 80 శాతం ఈ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ భారత ఉనికిని బలోపేతం చేయడం ద్వారా సముద్ర వాణిజ్య మార్గాలపై నిఘా పెట్టవచ్చని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యర్థుల కదలికలను సులభంగా పర్యవేక్షించవచ్చని భారత నౌకాదళ మాజీ వైస్ చీఫ్ శేఖర్ సిన్హా వంటి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అల్ జజీరా కథనం ప్రకారం, ఈ ప్రాజెక్టుకు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నుంచి పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. దీంతో నిర్మాణం పనులు కూడా మొదలయ్యాయి. అయితే, ఈ భారీ ప్రాజెక్టుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత అరుదైన షోంపెన్, నికోబరేస్ ఆదివాసీ తెగలు నివసించే ఈ ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం వారి ఉనికికే ప్రమాదకరమని మానవ హక్కుల సంఘాలు హెచ్చరిస్తున్నాయి. దాదాపు 10 లక్షల చెట్లను నరికివేయాల్సి రావడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ఇక్కడ పర్యటించి, సహజ, గిరిజన వారసత్వాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఆందోళనల మధ్యే, జాతీయ భద్రతకు అత్యంత కీలకమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్తోంది.

# మమత రెబల్ వర్గానికి ప్రతిపక్ష హోదా

**రితవ్రతకు విపక్ష నేత ఛాంబర్ తాళాలు**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తారాస్థాయికి చేరింది. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన నేత రితవ్రత బెనర్జీ, తమ వర్గాన్నే ప్రధాన ప్రతిపక్షంగా స్పీకర్ గుర్తించారని, తనకు ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా కల్పించారని ప్రకటించారు. గత నెల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఎంసీకి ఇది మరో గట్టి ఎదురుదెబ్బగా మారింది. బుధవారం సుమారు 58 నుంచి 60 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతు లేఖలతో రితవ్రత అసెంబ్లీకి చేరుకున్నారు. తమ వర్గానికి ప్రతిపక్ష హోదా కట్టబెట్టాలని కోరుతూ స్పీకర్ రతీంద్రనాథ్ బోస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తమదే అసలైన, ప్రధాన ప్రతిపక్షమని రితవ్రత స్పష్టం చేశారు. స్పీకర్ తమ ప్రతిపాదనను అంగీకరించి, ప్రతిపక్ష నేత కార్యాలయాన్ని తనకు కేటాయించారని, విపక్షనేత ఛాంబర్ తాళాలు తనకు అప్పగించారని ఆయన తెలిపారు. గత నెలలో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడం, సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అసమ్మతి పెరిగింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో జూన్ 1న రితవ్రతతో పాటు మరో ఎమ్మెల్యేను పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన మూడింట రెండొంతుల కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు తమకు ఉందని టీఎంసీ రెబల్ వర్గం చెబుతోంది. అయితేచ తాము మమతా బెనర్జీకి విధేయులమేనని, ఇది పార్టీలో చీలిక కాదని, 'అసలైన టీఎంసీ'ని తామేనని వారు పేర్కొంటున్నారు. ఈ కీలక పరిణామంపై స్పీకర్ కార్యాలయం నుంచి గానీ, టీఎంసీ అధిష్ఠానం నుంచి గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

# కువైట్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడి.. భారతీయుడి మృతి

రియాద్: గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడిలో ఒక భారతీయ పౌరుడు మరణించాడు. ఈ ఘటనలో మరో 63 మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు కువైట్ అధికారులు వెల్లడించారు. విమానాశ్రయంలోని టెర్మినల్ 1 లక్ష్యంగా ఈ దాడి జరిగింది. దీనివల్ల భారీ ఆస్తి నష్టం సంభవించిందని, విమాన సర్వీసులన్నింటినీ నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఒక భారతీయ పౌరుడు మరణించిన విషయాన్ని కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా ధృవీకరించింది. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందించేందుకు కువైట్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ దాడిలో గాయపడిన వారిలో కొందరికి తలకు తీవ్ర గాయాలు కాగా, మరికొందరి అవయవాలు దెబ్బతిన్నాయని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఏడుగురికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. సంఘటనా స్థలానికి 25 అంబులెన్సులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. తమ దేశంలోని పౌర, కీలక సదుపాయాలపై జరిగిన ఈ దాడిని కువైట్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అమెరికాకు సహకరిస్తున్నాయన్న కారణంతో గల్ఫ్ దేశాలపై ఇరాన్ ఇటీవల ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. ఇందులో భాగంగానే ఈ దాడి జరిగింది. గతంలోనూ కువైట్ విమానాశ్రయంపై దాడులు జరిగినా, ప్రాణనష్టం జరగడం ఇదే తొలిసారి. దాడి నేపథ్యంలో జూన్ 4 వరకు విమాన రాకపోకలను రద్దు చేశారు.

# సెన్సెక్స్ 300 పాయింట్లు పతనం



ముంబై: బుధవారం నాడు భారత ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఐటీ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనమయ్యాయి. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), ఫైనాన్షియల్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రా-డే కనిష్ఠ స్థాయిల నుంచి మార్కెట్లు గణనీయంగా కోలుకున్నాయి. దీంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 303.67 పాయింట్లు నష్టపోయి 74,346.17 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77.95 పాయింట్లు తగ్గి 23,405.60 వద్ద ముగిసింది. సెషన్ మొత్తంలో మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు కనిపించాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 5 శాతానికి పైగా పతనమై అత్యంత బలహీనంగా నిలిచింది. టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ వంటి షేర్లు సెన్సెక్స్ పతనానికి ప్రధాన కారణమయ్యాయి. మరోవైపు, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా లాభపడింది. నిఫ్టీ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, హెల్త్‌కేర్ సూచీలు కూడా మార్కెట్లకు మద్దతునిచ్చాయి. అపోలో హాస్పిటల్స్, టాటా మోటార్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు లాభపడ్డాయి. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 23,500 కీలక నిరోధక స్థాయిగా ఉంది. ఈ స్థాయిని దాటితే 23,800 వరకు రికవరీకి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అలాగే, తక్షణ మద్దతు 23,300-23,350 వద్ద ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, భారత రూపాయి విలువ వరుసగా రెండో సెషన్లోనూ పడిపోయింది. విదేశీ పెట్టుబడుల తరలిపోవడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రతిపాదనలపై ఆందోళనలు రూపాయి పతనానికి కారణమయ్యాయి. టెక్నికల్‌గా స్పాట్ యూఎస్‌డీ-ఐఎన్ఆర్‌కు 96.50 వద్ద నిరోధం, 95.10 వద్ద మద్దతు ఉన్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

# మొజ్తబాతో మాట్లాడాలనుంది: ట్రంప్




వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీతో భేటీ అయ్యేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సంకేతాలిచ్చారు. పరిస్థితులు అనుకూలిస్తే ఏదో ఒక సమయంలో ఆయన్ను కలవాలనుకుంటున్నానని ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. గత ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అప్పటి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. తండ్రి మరణానంతరం మొజ్తబా సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటికీ, అప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించలేదు. ఆయన ఆరోగ్యం, పాలనా సామర్థ్యంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దాడుల్లో తీవ్రంగా గాయపడినట్టు వార్తలు వచ్చాయి. అయితే, మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారని, మధ్యవర్తుల ద్వారా, రాతపూర్వకంగా పరిపాలనలో పాల్గొంటున్నారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మంగళవారం తెలిపారు. ఈ విషయాన్ని ట్రంప్ కూడా ధృవీకరించారు. పాలనాపరమైన నిర్ణయాలకు మొజ్తబా ఆమోదం తెలుపుతున్నారని ఆయన అన్నారు. ఇరు పక్షాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

# ఆఫ్ఘనిస్థాన్‌కు రష్యా 'రక్షణ'

**పాకిస్థాన్‌కు కొత్త తలనొప్పులు**




మాస్కో: అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో రష్యా తన మొట్టమొదటి అధికారిక సైనిక-సాంకేతిక సహకార ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మాస్కోలో జరిగిన అంతర్జాతీయ భద్రతా సదస్సులో ఆఫ్ఘన్ రక్షణ మంత్రి మహ్మద్ యాకూబ్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తాలిబాన్లకు ఆయుధాల సరఫరా, సైనిక సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, శిక్షణ, సంయుక్త ప్రాజెక్టులు చేపట్టే అవకాశం ఉంది. గతంలో తాలిబాన్లను వ్యతిరేకించిన రష్యా, 2025లో తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా నిలిచింది. ఇప్పుడు ఏకంగా వ్యూహాత్మక భద్రతా భాగస్వామిగా మారడం గమనార్హం. మాస్కోపై జరిగిన 'క్రాకస్ సిటీ హాల్' దాడి తర్వాత ఐసిస్-కె ఉగ్రవాద సంస్థను అణచివేయడం రష్యాకు అత్యంత కీలకంగా మారింది. అలాగే, 2021లో అమెరికా నిష్క్రమణ తర్వాత ఏర్పడిన శూన్యతను భర్తీ చేస్తూ మధ్య ఆసియాలో తన పట్టును నిలుపుకోవాలని రష్యా భావిస్తోంది. ఈ రక్షణ ఒప్పందం పాకిస్థాన్‌కు తీవ్ర కలవరాన్ని కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో సరిహద్దు ఘర్షణలు, టీటీపీ (తెహ్రీక్ ఇ తాలిబాన్ పాకిస్థాన్) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ఆశ్రయం కల్పిస్తోందనే పాక్ ఆరోపణల వల్ల తాలిబాన్-పాక్ సంబంధాలు క్షీణించాయి. ఇప్పుడు తాలిబాన్లకు రష్యా ఆయుధాలు అందిస్తే అది ఇస్లామాబాద్‌కు ప్రత్యక్ష భద్రతా సవాలుగా మారుతుంది. ఇది భారత్‌కు సానుకూల పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు చైనా ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌లోని లిథియం, రాగి వంటి ఖనిజ వనరులపై కన్నేసి తాలిబాన్లతో సంబంధాలను బలపరుచుకుంటోంది. ఈ రష్యా-తాలిబాన్ ఒప్పందం దక్షిణ, మధ్య ఆసియాలో అధికార సమీకరణాలను పూర్తిగా మార్చబోతోంది.




# పెద్ది రివ్యూ

కమర్షియల్ సినిమా చేయడానికి చాలా మంది హీరోలున్నారు. కానీ కథ నడిపించే సినిమా చేయాలంటే కమర్షియల్ హీరోకు ధైర్యముండాలి. ఆ ధైర్యం చేసాడు రామ్ చరణ్.. పెద్ది సినిమా కాదు ఓ ఎక్స్‌పీరియన్స్. బుచ్చిబాబు సినిమా తీయలేదు.. ఓ అద్భుతమైన ఎమోషనల్ కథ చెప్పాడు. సినిమాలో హై మూమెంట్స్ కోసం వెతకొచ్చు కానీ కథలో ఎత్తులు పల్లాలు రెండూ ఉంటాయి. పెద్ది అలాంటి ఓ అందమైన కథ. ఇందులో ఎత్తులే కాదు.. పల్లాలు కూడా ఉన్నాయి. కానీ ఆ లోతుల్ని మరిపించేలా పెద్దిని చివర్లో పై ఎత్తులో కూర్చోబెట్టాడు బుచ్చిబాబు. తీసుకున్న కథ పాతదే.. గుర్తింపు కోసం ఓ కుర్రాడు చేసే పోరాటమే ఈ సినిమా. తన పోరాటానికి ఆటను ఆయుధంగా, అస్త్రంగా వాడుకుంటాడు. పెద్ది గాడు తన ఆటతో ఏం చేసాడు; ఊరి భవిష్యత్తు ఎలా మార్చేసాడు? అనేది ఈ చిత్ర కథ. చెప్పడానికి చాలా సింపుల్ కానీ.. బుచ్చిబాబు దీన్ని తెరకెక్కించిన విధానం చాలా బాగుంది. ఫస్టాఫ్ అంతా కమర్షియల్ పంథాలో నడిపించాడు. క్రికెట్ సీన్స్ అన్నీ బాగానే వర్కవుట్ అయ్యాయి. మధ్యలో కొన్ని ల్యాగ్ సీన్స్ ఉన్నా కూడా.. ఇంటర్వెల్ నుంచి అసలు కథ మొదలవుతుంది. ఒక్కసారి కుస్తీ మొదలయ్యాక కథలో వేగం పెరుగుతుంది. క్లైమాక్స్‌కు వచ్చేసరికి ఎమోషనల్ టర్న్ తీసుకుంటుంది. సినిమా అంతా రామ్ చరణ్ ఒక్కడే తన భుజాలపై నడిపించాడు. తను చెప్పాలనుకున్న కథను ఎక్కడా డీవియేట్ కాకుండా చాలా గొప్పగా, హానెస్ట్‌గా చెప్పాడు బుచ్చిబాబు. రామ్ చరణ్ కూడా తన దర్శకుడు చెప్పిందల్లా కళ్లు మూసుకుని చేసుకుంటూ పోయాడు. కథ క్లైమాక్స్‌కు వచ్చేసరికి తెలియకుండానే బరువైన ఎమోషన్స్ మనసులో మొదలవుతాయి. రామ్ చరణ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టాడని చెప్పడం కూడా చిన్నమాటే అవుతుంది. ఒక్కటైతే నిజం.. రంగస్థలం చిట్టిబాబునే మరిపించే పాత్ర అయితే ఇందులో చరణ్ చేసాడు. శివరాజ్ కుమార్ పాత్ర కూడా చాలా బాగుంది.. జాన్వీ కపూర్, దివ్యేందు క్యారెక్టర్స్ ఓకే. అప్పల సూరిగా జగపతిబాబు చాలా మంచి పాత్రలో కనిపించాడు. ఈ సినిమాలో తెరపై కనిపించే హీరో రామ్ చరణ్ అయితే.. తెరవెనక నడిపించిన హీరో ఏఆర్ రెహ్మాన్. ఆయన రీ రికార్డింగ్ చాలా రీ ఫ్రెషింగ్‌గా అనిపించింది. సినిమా స్థాయిని పెంచేసింది. బుచ్చిబాబు తన వంతు ప్రయత్నం చాలా సిన్సియర్‌గా చేసాడు. హీరో దొరికాడు కదా అని కమర్షియల్‌గా కాకుండా మంచి కథ చెప్పాడు.

**ఓవరాల్‌గా పెద్ది..**

**మనసును కదిలించే కొండ కింద ఊరోడి కథ..!**

**సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు**






## 90% ధాన్యం కొనుగోలు పూర్తి

**ప్రతిపక్షాలవి మొసలి కన్నీళ్లు.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, జూన్ 3 (ఈవార్తలు): రైతుల సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో 90 శాతం ధాన్యం కొనుగోలు చేసినట్లు, మరో మూడు నాలుగు రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బుధవారం గంగాధర మండలం నాగిరెడ్డి పూర్ లో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు పై ప్రతిపక్షాలు ఎన్నో ఆరోపణలు చేశాయని, ధాన్యం కొనుగోలు చేయడం లేదని, లారీలు రావడంలేదని బురదజల్లే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా, మొసలి కన్నీరు కార్చినా రైతులు వారిని నమ్మలేదని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని సమస్యలను అధిగమించి జూన్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ధాన్యం సేకరణ పది రోజులు ఆలస్యమైనా రైతుల సహకారంతో సకాలంలో పూర్తి చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు నాలుగు రోజుల్లోనే ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాము,స్థానిక సర్పంచ్ గునుకొండ బాబు, ఆకుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న కుమారుడి పెళ్లి పనుల్లో వినోద్

జగిత్యాల, జూన్ 3 (ఈవార్తలు): మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ – డాక్టర్ మాధవి దంపతుల చిన్న కుమారుడు బోయినపల్లి ప్రణయ్ వివాహ ఆహ్వాన పత్రికను జగిత్యాల జానకి చెస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ధీరజ్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ధీరజ్ రావును మర్యాదపూర్వకంగా కలిసి, వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. అటు.. జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌ను కూడా వినోద్ ఆహ్వానించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి వారిని వివాహానికి ఆహ్వానించారు.



## బీరయ్య పట్నాలకు ఎమ్మెల్యే సంజయ్ హాజరు

జగిత్యాల రూరల్, జూన్ 3 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలంలోని తక్కలపల్లి గ్రామంలో నిర్వహించిన బీరయ్య పట్నాల కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కలపల్లి గ్రామానికి పల్లె దవాఖాన మంజూరు చేయించినట్లు తెలిపారు. గతంలో బీరయ్య గుడి వద్ద భక్తుల అవసరాల కోసం రూ.2 లక్షల వ్యయంతో నీటి సదుపాయానికి పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బీరయ్య ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆలయ నిర్మాణం కోసం ఐదు గుంటల స్థలాన్ని దానంగా ఇచ్చిన దాతలను శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం కురుమ సంఘం సభ్యులు ఆలయానికి బోర్‌వెల్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా, సానుకూలంగా స్పందించారు. దీంతో గ్రామ ప్రజలు, కురుమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, ఏఎంసీ చైర్మన్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కురుమ సంఘం సభ్యులు, కుల బంధువులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

**అక్రెడిటేషన్‌తో సంబంధం లేకుండా పట్టాలివ్వాలి.. సీఎంకు జీహెచ్‌జే సొసైటీ సర్వసభ్య సమావేశం వినతి**

హైదరాబాద్, జూన్ 3 (ఈవార్తలు): సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

### మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యఱ్రమిల్లి రామారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## కొమిరెడ్డి సేవలు చిరస్మరణీయం: అడ్లూరి

మెట్‌పల్లి, జూన్ 3 (ఈవార్తలు): న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంత ప్రజలకు కొమిరెడ్డి రాములు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం మెట్‌పల్లిలో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు జయంతి వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొమిరెడ్డి రాములు చిత్రపటానికి నివాళు లర్పించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా కొమిరెడ్డి రాములు, జ్యోతక్క విగ్రహాల ఏర్పాటు కోసం ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాములు కుటుంబ సభ్యులు సూచించిన స్థలంలో వచ్చే జయంతి లోపు విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల కాంగ్రెస్ ఇంచార్జ్ నర్సింగరావు పర్యవేక్షణలో విగ్రహాల ఏర్పాట్ల పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. వచ్చే జయంతి నాటికి విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్యతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంగారం అమ్మలేదు: ఆర్బీఐ

న్యూఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం కారణంగా పడిపోతున్న రూపాయి విలువను కాపాడటానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సంచలన నిర్ణయం తీసుకుందంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. విదేశీ మారక నిల్వలను పెంచుకునేందుకు ఏకంగా 12 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని విక్రయించిందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక పేర్కొంది.

# తెలంగాణ మీ జాగీరు కాదు

**పవన్ వ్యాఖ్యలపై అడ్లూరి ఫైర్**



ధర్మపురి, జూన్ 3 (ఈవార్తలు): నోరు ఉందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హితవు పలికారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో పుష్కరాల ఏర్పాట్లపై రోడ్లు–భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. “తెలంగాణ మీ జాగీరు” అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సభలు, సమావేశాలకు అనుమతులు మంజూరు చేస్తారని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్‌ను సినీ నటుడిగా అందరూ అభిమానిస్తారని, అయితే రాజకీయ నాయకుడిగా బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ ప్రజలకు ప్రత్యేకమైన దయాగుణం, మానవత్వం ఉన్నాయని మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పుష్కరాల పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈసారి దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏడాది ముందుగానే పనులు ప్రారంభించి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు

**పుష్కరాల పనులకు అదనపు బడ్జెట్**

గోదావరి పుష్కరాలు–2027 సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన అదనపు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులు, మంజూరైన నిధులు, టెండర్ల పురోగతిపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ కోటిలింగాల, ధర్మపురి క్షేత్రాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణం, ట్రాఫిక్ నిర్వహణ చర్యలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల విస్తరణ, కొత్త ఘాట్ల నిర్మాణం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఆదేశించారు. ధర్మపురిలో హెలీప్యాడ్, రహదారులు, ఇతర మౌలిక వసతుల కోసం అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. కోటిలింగాల, ధర్మపురి దేవాలయాల అభివృద్ధి పనులను వేగవంతం చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం తొలి విడతలో రూ.117 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. కోటిలింగాలకు రూ.34.10 కోట్లు, ధర్మపురికి రూ.83.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భూసేకరణ, రహదారుల నిర్మాణం తదితర పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## బాసర ట్రిపుల్ ఐటీలో జగిత్యాల హవా

**జిల్లాకు చెందిన 126 మందికి సీట్లు.. జిల్లా విద్యాధికారికి పీఆర్టీయూటీఎస్ సన్మానం**

జగిత్యాల, జూన్ 3 (ఈవార్తలు): 2026 ఎస్సెస్సీ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జగిత్యాల జిల్లాకు చెందిన 126 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం పట్ల జిల్లా విద్యాధికారి కె. రామును పీఆర్టీయూటీఎస్ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ, బాసర ట్రిపుల్ ఐటీలో 126 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందడం జిల్లాకు గర్వకారణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగిత్యాల జిల్లా రెండో స్థానంలో నిలవడం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు జిల్లా విద్యాధికారి కె. రాము తీసుకున్న ప్రత్యేక చర్యలు, ఉపాధ్యాయుల అంకితభావం ఈ విజయానికి దోహదపడ్డాయని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రామును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## ‘గిటార్ విజ్’కు యాపిల్ పురస్కారం

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ నుంచి భారతీయ యాప్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇండియాకు చెందిన ‘గిటార్ విజ్’ యాప్, 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన యాపిల్ డిజైన్ అవార్డును గెలుచుకుంది. విభిన్న సామర్థ్యాలు గల వినియోగదారులకు సంగీతాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో చేసిన కృషికి గాను ‘ఇన్‌క్లూజివిటీ’ (సమ్మిళిత) కేటగిరీలో ఈ పురస్కారం దక్కింది. భారతీయ డెవలపర్ బిజోయ్ తంగరాజ్ ఈ అద్భుతమైన యాప్‌ను రూపొందించారు. గిటార్ నేర్చుకునే కొత్తవారికి, ఇప్పటికే అనుభవం ఉన్నవారికి ఒక సమగ్రమైన టూల్‌కిట్‌గా ఈ యాప్ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా స్వరాలు, కార్డ్స్, వేళ్ల స్థానం వంటి అంశాలపై మాటల ద్వారా సూచనలు (వాయిస్ గైడెన్స్) ఇవ్వడం దీని ప్రత్యేకత. దీనివల్ల సంగీతకారులు ఎలాంటి సహాయం లేకుండా స్వతంత్రంగా గిటార్ వాయించడం నేర్చుకోవచ్చు. విభిన్న నేపథ్యాలు, చెందిన ప్రతీ ఒక్కరికీ సంగీతాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో దీనిని రూపొందించినట్లు యాపిల్ ప్రశంసించింది.

ఒయ్యారి చిత్రం





# పండు మాస్టర్‌కు యాక్సిడెంట్..

**రెండు కాళ్లకు సర్జరీ!**

విశాఖ జిల్లా ఆనందపురం వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్ పండు (జి.షణ్ముఖ) కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ఆరోగ్య పరిస్థితిని విశాఖపట్నం మెడికవర్ వైద్యులు మీడియాకు వివరించారు. రోడ్డు ప్రమాదంలో పండు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఎడమ తుంటి కీలు డిస్ లొకేషన్ అయ్యిందని, తలకి కూడా స్వల్ప గాయమైనట్లు వెల్లడించారు. అన్ని రకాల పరీక్షల అనంతరం కాళ్లకు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆరు నెలల వరకు పూర్తి విశ్రాంతి తీసుకుంటే త్వరగా కోలుకుంటారని తెలిపారు. మరోవైపు విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం లొడగలవానిపాలెం వద్ద మంగళవారం రోజు రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అనకాపల్లికి చెందిన బాలు రైడర్స్ అనే డ్యాన్స్ గ్రూప్.. మంగళవారం భీమిలి మండలంలో ఓ ఈవెంట్ పూర్తిచేసుకుని రాత్రి సమయంలో తిరిగి వస్తోంది. ఈ క్రమంలోనే లొడగలవానిపాలెం వద్దకు రాగానే కారులోని ఓ మహిళకు వాంతులు అయ్యాయి. దీంతో వాహనాన్ని రోడ్డుపై ఆపి, కారులోని వ్యక్తులు కిందకు దిగారు. ఈ సమయంలోనే ఓ కోళ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక నిలబడిన పండు మాస్టర్, లిఖిత ప్రియ, హారికకు గాయాలయ్యాయి. పండు మాస్టర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే మరో కారులో విశాఖలోని ఆస్పత్రికి తరలించారు.



# జూలై 5న ఆమీర్ మూడో పెళ్లి

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ తన భాగస్వామి గౌరీ స్ప్రాట్‌ను జూలై 5న వివాహం చేసుకోనున్నట్లు సమాచారం. ఈ వివాహ వేడుకను అత్యంత నిరాడంబరంగా, కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతీయ మీడియా సమాచారం ప్రకారం, జూలై 5న ముంబైలోని ఆమిర్ ఖాన్ నివాసంలోనే ఈ పెళ్లి జరగనుంది. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా రిజిస్టర్ మ్యారేజ్ రూపంలో వీరు ఒక్కటి కానున్నారు. ఇప్పటికే వివాహ ఏర్పాట్లు ప్రారంభమైనట్లు బాలీవుడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రైవేట్ వేడుకకు బాలీవుడ్ స్టార్‌లు సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. వీరిద్దరూ ఆమిర్‌కు అత్యంత సన్నిహిత మిత్రులు కావడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. గౌరీ స్ప్రాట్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న బ్రిటిష్ కమ్యూనిస్ట్ ఫిలిప్ స్ప్రాట్ మనవరాలు. ఆమెకు గత వివాహం ద్వారా క్విన్ అనే ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇక ఆమిర్ ఖాన్‌కు ఇది మూడో వివాహం కానుంది. గతంలో ఆయన రీనా దత్తాను వివాహం చేసుకోగా, వారికి జునైద్, ఐరా అనే ఇద్దరు సంతానం ఉన్నారు. అనంతరం కిరణ్ రావును వివాహం చేసుకున్న ఆమిర్‌కు ఆజాద్ అనే కుమారుడు ఉన్నాడు. అయితే 2021లో ఆమిర్, కిరణ్ రావు విడాకులు తీసుకున్నారు. గతేడాది ముంబైలో జరిగిన తన పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆమిర్ ఖాన్ గౌరీని మీడియాకు పరిచయం చేశారు.

# యూట్యూబర్ రమా నందనపై కేసు



ప్రముఖ యూట్యూబర్, నటి రమా నందన అలియాస్ నందు చిక్కుల్లో పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో నందు కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. యూకే వీసా రెన్యువల్ పేరుతో తనను 15 లక్షల రూపాయల మేరకు మోసం చేశారంటూ బాధితుడి ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు నటి రమా నందన, ఆమె భర్త మధుకర్, మధుకర్ తండ్రిపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వెస్ట్ ఇబ్రహీంపట్నంకు చెందిన మామిళ్లపల్లి శివక్రాంతి కుమార్ అనే వ్యక్తి యూకేలో ఉండేవారు. అయితే తన యూకే వీసా గడువు తీరిపోతూ ఉండటంతో యూకే వీసా రెన్యువల్ కోసం డెస్టినీ కన్సల్టెన్సీ సంస్థను శివక్రాంతి కుమార్ ఆశ్రయించారు. దీంతో భారతదేశంలో ఉన్న తమ బ్రాంచ్‌లో డబ్బులు చెల్లిస్తే వీసా ప్రాసెస్ చేస్తామని కన్సల్టెన్సీ నిర్వాహకులు చెప్పినట్లు శివక్రాంతి కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి మాటలు నమ్మి రూ. 15 లక్షల వరకు చెల్లించారు. అయితే నెలలు గడుస్తున్నా కూడా వీసా రాకపోవటం, నిందితుల నుంచి సరైన సమాధానం లేకపోవటంతో శివక్రాంతి కుమార్ తాను మోసపోయిన విషయం గ్రహించి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా నిందితులపై క్రైమ్ నంబర్ 515/2025 కింద కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ రాజు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డెస్టినీ కన్సల్టెన్సీ డైరెక్టర్ జాగర్లమూడి మధుకర్, ఆయన భార్య రమానందన, గుంటూరులో ఉండే మధుకర్ తండ్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు వెల్లడించారు.

# రొమాంటిక్ థ్రిల్లర్‌తో కీర్తి



టాలీవుడ్ యంగ్ హీరోయిన్, నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ గత ఏడాది 'రివాల్వర్ రీటా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ పెద్దగా మెప్పించలేకపోయింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. తెలుగులో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్ధన' చేస్తుండగా.. రాజ్‌కుమార్ రావు సరసన 'రఫ్తార్' చిత్రంలో ప్రధాన పాత్రలో కనిపించనుంది. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనురాగ్ ఠాకూర్, రోహన్ వర్మ, తాన్యా మణిక్తాలా, రజత్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. ఇది దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16, 2026న థియేటర్లలో విడుదల కానుంది. మరోవైపు.. ప్రవీణ్ ఎస్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సత్యవాన్ సావిత్రి' అనే కోర్టు రూమ్ లీగల్ డ్రామా ప్రాజెక్ట్‌ను కూడా కీర్తి ఇటీవల ప్రకటించింది. మలయాళంలో ఆంటోనీ వర్గీస్ పెపేతో కలిసి 'తోట్టం' అనే చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. ఇవే కాకుండా, టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలిసి చేయబోయే మల్టీస్టారర్ చిత్రంలో కూడా కీర్తి సురేష్ ఒక హీరోయిన్‌గా నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## త్రిషకు ఉపాసన సర్ ప్రైజ్


సౌత్ క్వీన్ త్రిషకు మెగా కోడలు ఉపాసన కొణిదెల ఒక సమ్మర్ గిఫ్ట్ పంపారు. ఉపాసన సొంతంగా నిర్వహిస్తున్న అత్తమ్మాస్ కిచెన్ బ్రాండ్ తరపున ఒక ప్రత్యేకమైన గిఫ్ట్ హ్యాంపర్ త్రిష ఇంటికి చేరింది. సాధారణంగా సెలబ్రిటీలు ఖరీదైన బహుమతులు ఇచ్చుకుంటారు. కానీ ఇక్కడ పూర్తిగా ట్రెడిషనల్ టచ్ ఉన్న గిఫ్ట్ రావడం విశేషం. ఈ పార్సిల్ చూసిన వెంటనే త్రిష ఎంతో ఆనందపడిపోయారు. తన సోషల్ మీడియాలో ఆ ఫుడ్ ఐటమ్స్ ఫోటోలను షేర్ చేసి థాంక్స్ చెప్పారు. వేసవి కాలం వచ్చేసిందన్న ఫీలింగ్ ఈ గిఫ్ట్ వల్లే కలిగిందని ఆమె రాసుకొచ్చారు. ఇంతకీ ఆ స్పెషల్ బాక్స్ లో ఏముందంటే తెలుగింటి వేసవిలో అందరూ ఇష్టంగా తినే ఆవకాయ పచ్చడితో పాటు రకరకాల హోమ్ మేడ్ పొడులు ఆ ప్యాకేజీలో ఉన్నాయి. కేసరి, పొంగల్ లాంటి ఐటమ్స్ కూడా అందులో ప్యాక్ చేసి ఉంచారు. అత్తమ్మాస్ కిచెన్ పేరుతో ఉపాసన మన సంప్రదాయ వంటకాలను ఆన్లైన్ లో సేల్ చేస్తున్న సంగతి తెలిసిందే. బిజినెస్ ప్రమోషన్ లో భాగంగానే తనకు పరిచయం ఉన్న స్టార్స్ కు బహుమతులు పంపుతున్నారు.

## జూన్ 19న విజయ్ ఆంటోని వంద దేవళ్ళు




'బిచ్చగాడు' సినిమా ఎలాంటి సక్సెస్ అందుకుందో అందరికి తెలిసిందే. విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వచ్చిన ఈ మూవీ సూపర్ డూపర్ హిట్ టాక్ తెచ్చుకున్ని ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. ఇప్పుడు ఇదే కాంబో 'వంద దేవుళ్ళు' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. విజయ్ ఆంటోని హీరోగా, డైరెక్టర్ శశి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో స్వాసిక అజయ్, కావ్య, శక్తి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రామాజనేయులు జవ్వాని నిర్మతగా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్‌తో పాటు సాంగ్స్ కూడా చాట్ బాస్టర్ హిట్ అందుకున్నాయి. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. ఈ క్రమంలోనే తాజాగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు సినిమా తెలుగుతో పాటు తమిళంలో జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ప్రకటిస్తూ ఓ సరికొత్త పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ ఆంటోని, స్వాసిక అజయ్ సైకిల్ మీద వెళ్తు కనిపించి ఆకట్టుకుంటున్నారు.

## రణవీర్‌పై నిషేధం ఎత్తివేత



బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌పై సినీ కార్మిక సంఘం ఎఫ్‌డబ్ల్యూఐసీఈ (ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్) నిషేధం విధించిన విషయం తెలిసిందే. డాన్-3 నుంచి ఆయన సడెన్‌గా తప్పుకోవడంతో నిర్మాతలకు కోట్లలో నష్టం వచ్చిందంటూ ఆరోపించిన సదరు సంస్థ రణవీర్‌పై నిషేదం విధించింది. తాజాగా ఈ వివాదంపై రణవీర్ కోర్టును ఆశ్రయించి ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సంస్థకు లీగల్ నోటీసులు పంపారు. ఈ క్రమంలోనే రణవీర్ సింగ్‌పై విధించిన నాన్ కో-ఆపరేషన్ ఆదేశాలను ఉపసంహరించుకున్నట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సంస్థ అధ్యక్షుడు బీఎన్ తివారీ ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ఈ మేరకు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేరకు అశోక్ పండిట్ ఈ విషయంపై మాట్లాడుతూ.. 'నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని రణవీర్ కోరారు.



# భారత్ ఘన విజయం!

జపాన్‌లోని కాకామిగహారా వేదికగా జరుగుతున్న అండర్-18 ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు మరోసారి లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసింది. సోమవారం జరిగిన పూల్-ఎ మ్యాచ్‌లో కెప్టెన్ కేతన్ కుష్వాహా మెరుపు దాడితో భారత్ 4-1 గోల్స్ తేడాతో బలమైన దక్షిణ కొరియా జట్టును సులువుగా ఓడించింది. ఈ విజయంతో లీగ్ దశలో ఆడిన 3 మ్యాచ్‌ల్లో భారత్‌కు ఇది రెండో విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత కెప్టెన్ కేతన్ కుష్వాహా ముందుండి జట్టును నడిపించాడు. మ్యాచ్ 3వ, 36వ నిమిషాల్లో రెండు కీలక గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కేతన్ కుష్వాహాతో పాటు వరిందర్ సింగ్(5వ నిమిషం), షారూఖ్ అలీ(54వ నిమిషం) చెరో గోల్ చేసి స్కోరు బోర్డును పరుగెత్తించారు. కొరియా జట్టు తరఫున కెప్టెన్ యూన్ జెహ్యూక్ 21వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. ప్రస్తుతం పూల్-ఎ లో భారత్, కొరియా, జపాన్ జట్లు ఆరేసి పాయింట్లతో సమానంగా ఉన్నప్పటికీ.. మెరుగైన గోల్ డిఫరెన్స్ కారణంగా భారత్ గ్రూప్ టాప్‌లో నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో రెండు పూల్స్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. కొరియాపై సాధించిన ఈ భారీ విజయం భారత్ సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరిచింది. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి క్వార్టర్ ఐదో నిమిషానికే భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆట 3వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను రాహుల్ యాదవ్ పాస్ సాయంతో కెప్టెన్ కేతన్ గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే 5వ నిమిషంలో గాజీ ఖాన్ అందించిన అద్భుతమైన పాస్‌ను వరిందర్ సింగ్ ఏమాత్రం తడబడకుండా గోల్ పోస్ట్‌లోకి పంపి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. రెండో క్వార్టర్ లో కొరియా పుంజుకుని 21వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి స్కోరును 2-1కి తగ్గించింది. అయితే మూడు, నాల్గవ క్వార్టర్లలో భారత్ మళ్లీ ఆటపై పట్టు సాధించింది. 36వ నిమిషంలో కేతన్ కుష్వాహా వ్యక్తిగత రెండో గోల్ కొట్టి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసే సమయానికి (53వ నిమిషంలో) కొరియా గోల్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ.. భారత గోల్‌కీపర్ ఆయుష్ రజక్ అద్భుతమైన డిఫెన్స్‌తో దానిని అడ్డుకున్నాడు. ఆ మరుసటి నిమిషంలోనే భారత్ ఎదురుదాడికి దిగి, షారూఖ్ అలీ క్లాస్ షాట్‌తో నాల్గవ గోల్ కొట్టి 4-1తో భారత్ విజయాన్ని ఖరారు చేశాడు. టీమిండియా తన తదుపరి పూల్-ఎ మ్యాచ్‌లో జూన్ 3న చైనీస్ తైపీతో తలపడనుంది.




# అయ్యర్‌కు టీ20 పగ్గాలు?

**టీమిండియాలో సంచలన మార్పు చోటుచేసుకోబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల భారత్‌కు టీ20 వరల్డ్ కప్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ను ఆ బాధ్యతల నుంచి తప్పించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం.**

'స్కై' ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం, దానికి తోడు ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరఫున కేవలం 19.5 సగటుతో 195 పరుగులు మాత్రమే చేసి పేలవమైన ఫామ్‌ను కనబర్చడం సెలెక్టర్ల ఆలోచనలకు కారణమైంది. అలాగే, ప్రస్తుతం ఆయనకు 35 ఏళ్లు పైబడటంతో భవిష్యత్ టీ20 సైకిల్‌ను దృష్టిలో పెట్టుకుని యువకుడికి పగ్గాలు అప్పగించాలని బీసీసీఐ భావిస్తోంది. అయితే, సూర్యకుమార్ కెప్టెన్‌గా తప్పిస్తుండటంతో ఆ స్థానంలో కోల్‌కతా నైట్ రైడర్స్ మాజీ కెప్టెన్, ప్రస్తుతం పంజాబ్ కింగ్స్‌ను విజయవంతంగా నడిపిస్తున్న శ్రేయస్ అయ్యర్ ను తీసుకురాబోతున్నట్లుగా తెలుస్తోంది. ఐపీఎల్‌లో శ్రేయాస్‌కు మెరుగైన కెప్టెన్సీ రికార్డుతో పాటు 171 స్ట్రైక్ రేట్‌తో అద్భుతమైన ఫామ్‌లో ఉండటం ఆయనకు ప్లస్ పాయింట్‌గా మారింది. అదేవిధంగా సంజూ శాంసన్, వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్ పేర్లు కూడా కెప్టెన్ పరిశీలనో ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా, వచ్చే వారం ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు జట్లను ఎంపిక చేసే సెలెక్షన్ కమిటీ సమావేశంలో కెప్టెన్సీ మార్పుపై తుది నిర్ణయం తీసుకునే చాన్స్ ఉంది.






## ఐపీఎల్ 2027 కమిన్స్ దూరం అవుతానేమో

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళన కలిగించే వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. జట్టు కెప్టెన్, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ .. ఐపీఎల్ 2027 సీజన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అతడి స్వయంగా హింట్ ఇచ్చాడు. భవిష్యత్‌తో అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉందని.. దీంతో పనిభారం దృష్ట్యా.. ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు. కాగా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది. ఈ గ్యాప్‌లో ఆస్ట్రేలియా జట్టు.. ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, భారత్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, ఆ తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 ఆడాల్సి ఉంది. ఒకవేళ పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిస్తే.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కూడా ఆడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. ఈ టోర్నీలు అన్నింట్లో ఆడాలని భావిస్తున్నాడు. దీంతో అవసరమైతే ఐపీఎల్ 2027కు దూరమయ్యేందుకు సిద్ధమయ్యాడు. "వచ్చే ఏడాది ఏదో ఒక దశలో నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది దేశం తరఫున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీ (సన్‌రైజర్స్ హైదరాబాద్)తో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే దీనిపై నేను ఇంతకంటే ఎక్కువ క్లారిటీ ఇవ్వలేను. ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాలు కూడా కావచ్చు" అని పత్రికతో మాట్లాడుతూ కమిన్స్ వ్యాఖ్యానించాడు.




## 'మమ్మల్ని ఆదరించండి': స్మృతి మంధాన

మహిళల క్రికెట్ చరిత్రలో మరో అత్యుత్తమ సమరానికి తెరలేవబోతోంది. జూన్ 12 నుంచి అత్యంత ప్రతిష్టాత్మకమైన మహిళల టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ మెగా ఈవెంట్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా వైస్‌కెప్టెన్ స్మృతి మంధాన సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రపంచకప్ లాంటి మెగాటోర్నీ జరుగుతున్నా భారత్-పాక్ మధ్య మ్యాచ్‌కు మాత్రమే హైప్ ఉందని, మిగిలిన టోర్నీకి కూడా అదే స్థాయిలో ఆదరణ చూపాలని అభిమానులకు విజ్ఞప్తి ఆసక్తి కలిగించింది. భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్, హైప్ సహజమైనదే అయినప్పటికీ.. కేవలం ఆ ఒక్క మ్యాచ్‌కే పరిమితం కాకుండా టోర్నీ మొత్తానికి భారీ స్థాయిలో ప్రచారం కల్పించాలని ఆమె కోరారు. మహిళల క్రికెట్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందుతోందని, ప్రతి జట్టులోనూ అద్భుతమైన ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారని ఆమె గుర్తుచేశారు. అభిమానులు, క్రీడా విశ్లేషకులు, మీడియా సంస్థలు కేవలం భారత్-పాక్ పోరుపైనే కాకుండా, టోర్నమెంట్లో జరిగే మిగిలిన అన్ని మ్యాచ్లపై కూడా అంతే శ్రద్ధ పెట్టాలని, అప్పుడే మహిళల క్రికెట్కు నిజమైన గుర్తింపు దక్కుతుందని మంధాన అభిప్రాయపడ్డారు. పురుషుల క్రికెట్‌తో సమానంగా తాము అద్భుతాలు చేస్తున్నప్పటికీ మహిళల క్రికెట్‌పై ఇంకా చిన్నచూపేనని పేర్కొన్నారు.




## పాటీదార్‌కు గుర్తింపు ఎక్కడ?

18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలిసారి విజేతగా నిలిచింది. ఆ తర్వాతి సీజన్ అంటే ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో టైటిల్ నిలబెట్టుకుంది. దీంతో వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ సాధించిన మూడో జట్టుగా అవతరించింది. ఈ రెండు సార్లు ఆర్సీబీ కెప్టెన్‌గా రజత్ పటీదార్ ఉన్నాడు. ఐపీఎల్ 2022 సందర్భంగా మరో ఆటగాడు గాయపడటంతో రీప్లేస్‌మెంట్‌గా ఆర్సీబీలోకి వచ్చిన పటీదార్.. ఆ జట్టు రాతను మార్చేశాడు. విరాట్ కోహ్లీ, అనిల్ కుంబ్లే, డేనియల్ విటోరీ, రాహుల్ ద్రవిడ్ లాంటి ప్లేయర్లకు సాధ్యం కాని టైటిల్‌ను జట్టుకు అందించాడు. ఆర్సీబీకి వరుసగా రెండు టైటిల్స్ అందించినప్పటికీ రజత్ పటీదార్‌కు రావాల్సినంత పేరు రాలేదని ఆస్ట్రేలియా వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ మైకెల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. అతడు భారత జట్టు తరఫున ఆడేందుకు అర్హుడని పేర్కొన్నాడు. "ఆర్సీబీ కెప్టెన్‌గా రజత్ పటీదార్ మరోసారి అదరగొట్టాడు. అతడు స్టార్ క్రికెటర్ కాదు. ఏది ఏమైనా విరాట్ కోహ్లీ ఆర్సీబీ జట్టులో ఉండటంతో అందరూ అతడి గురించే మాట్లాడతారు. కానీ ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి. పటీదార్ కెప్టెన్‌గా ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టాడు. వ్యక్తిగతంగా కూడా మిడిల్ ఆర్డర్‌లో అదిరే ఆటతీరు కనబరిచాడు. భారత టీ20, వన్డే జట్టులో పటీదార్‌కు చోటు కల్పించే విషయంపై చర్చ జరగాలి" అని మైకెల్ క్లార్క్ వ్యాఖ్యానించాడు. "రజత్‌లో నాయకత్వ లక్షణాలున్నాయి. దానికి తోడు మిడిల్ ఆర్డర్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తాడు. టీ20ల్లో ఫోర్త్ ప్లేసులో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. భారత్‌లో ప్రస్తుతం ఎంతోమంది ప్రతిభగల క్రికెటర్లు ఉన్నారు. వారంతా భారత జట్టులో చోటు కోసం పోటీలో ఉంటారు. కానీ వరుసగా 2 ఐపీఎల్ టైటిల్స్ అందించిన కెప్టెన్ రజత్‌ను సెలక్టర్లు తప్పకుండా దృష్టిలో ఉంచుకుంటారు.




## కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాక్

యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానం మళ్లీ షాకిచ్చాడు. హోమ్‌టౌన్ హీరో, వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ మ్యాగ్నస్ కార్ల్‌సన్‌పై వరుసగా రెండోసారి విక్టరీ కొట్టాడు. నార్వే చెస్ టోర్నీలో క్లాసికల్ గేమ్‌లోనూ కార్ల్‌సన్‌పై స్టన్నింగ్ విక్టరీ సాధించాడు ప్రజ్ఞానంద. మరోవైపు వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్.. నార్వే టోర్నీలో చేతులెత్తేశారు. 8వ రౌండ్ గేమ్‌లో ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు.దీంతో పాయింట్ల పట్టికలో గుకేశ్ దిగువ స్థాయిలో ఉండిపోయాడు. డబుల్ రౌండ్ రాబిన్ ఎలైట్ ఈవెంట్‌లో ప్రజ్ఞానంద అసాధారణ ప్రతిభ కనబరిచారు. క్లాసికల్ గేమ్‌లో ఈ ఏడాది కార్ల్‌సన్‌పై రెండు సార్లు గెలిచిన ప్లేయర్‌గా ఇండియన్ స్టార్ నిలిచాడు. ఈ టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉన్నాయి. కానీ 20 ఏళ్ల ప్రజ్ఞానంద 12 పాయింట్లతో ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్నాడు. అలీరేజా 13 పాయింట్లతో రెండో స్థానంలో, అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లే సో 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# యువత ఆశలతో ఆటలు

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ఇప్పుడు వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. వేలాది మంది నిరుద్యోగ యువత జీవితాలకు ముడిపడిన ఈ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ప్రతిపక్షాలు, అభ్యర్థుల నుంచి వస్తున్న ఆరోపణలు ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారాయి. ఉద్యోగ నియామకాల వంటి అత్యంత సున్నితమైన అంశంలో పారదర్శకత, నిష్పాక్షికతపై అనుమానాలు వ్యక్తమవుతుండటం ఆందోళనకర పరిణామం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడం స్వాగతించదగిన విషయమే. అయితే ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి అభ్యర్థులు లేవనెత్తిన సందేహాలు, ఫిర్యాదులు, సాంకేతిక లోపాలపై వచ్చిన ఆరోపణలు సమాధానాల కంటే ప్రశ్నలనే ఎక్కువగా మిగిల్చాయి. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల ప్రమాణం, మూల్యాంకన విధానం, తుది ఎంపిక ప్రక్రియ వంటి అంశాల్లో స్పష్టత లేకపోవడం వల్ల అభ్యర్థుల్లో అనుమానాలు పెరిగాయి. ప్రతిపక్షాలు మరింత తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నాయి. అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, కొందరికి ప్రయోజనం చేకూరేలా వ్యవస్థను ప్రభావితం చేశారని, ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ప్రక్రియ సాగిందని ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా కాదా అనేది విచారణలో తేలాల్సిన విషయమే. కానీ వేలాది మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం కేవలం ఖండనలతో సరిపెట్టుకోవడం సమంజసం కాదు. నియామక ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమైన వెంటనే ప్రభుత్వం స్వతంత్ర విచారణకు ఆదేశించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. కానీ ఆరోపణలు వస్తున్నప్పటికీ అధికార వర్గాలు వాటిని రాజకీయ దుష్ప్రచారంగా కొట్టిపారేయడమే ఎక్కువగా కనిపిస్తోంది. ఇది ప్రజల్లో మరింత అనుమానాలకు తావిస్తోంది. నిజంగా ప్రక్రియ పారదర్శకంగా జరిగి ఉంటే ప్రతి దశను ప్రజల ముందుంచడానికి ప్రభుత్వం వెనుకాడాల్సిన అవసరం ఏముంది? ఉద్యోగ నియామకాలు కేవలం పరిపాలనా కార్యక్రమాలు కావు. అవి ప్రభుత్వ విశ్వసనీయతకు అద్దం పడతాయి. ఒకసారి నియామక వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటే దాన్ని తిరిగి నిలబెట్టడం చాలా కష్టం. ముఖ్యంగా ఉపాధ్యాయ నియామకాల విషయంలో జరిగే ప్రతి తప్పు భవిష్యత్ తరాల విద్యా నాణ్యతపై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే డీఎస్సీ వంటి ప్రక్రియలు వివాదాలకు అతీతంగా ఉండాలి. ప్రస్తుతం అవసరమైనది రాజకీయ వాదోపవాదాలు కాదు; సంపూర్ణ పారదర్శకత. అభ్యర్థులు లేవనెత్తిన ప్రతి అభ్యంతరాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. అవసరమైతే న్యాయ నిపుణులు, విద్యా నిపుణులు, సాంకేతిక నిపుణులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసి మొత్తం ప్రక్రియను సమీక్షించాలి. ఫలితాల విడుదల నుంచి ఎంపికల వరకు ప్రతి అంశాన్ని బహిరంగంగా ఉంచాలి. అలా చేసినప్పుడే ప్రజల్లో, ముఖ్యంగా ఉద్యోగార్థుల్లో విశ్వాసం పునరుద్ధరించబడుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం విమర్శలకు అతీతం కాదు. ముఖ్యంగా యువత భవిష్యత్తుతో ముడిపడిన నియామకాల విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మెగా డీఎస్సీ నిజంగా పారదర్శకంగా జరిగి ఉంటే ప్రభుత్వం దాన్ని నిరూపించాలి. లేకపోతే ఈ వివాదం కేవలం రాజకీయ అంశంగా కాకుండా నిరుద్యోగ యువత ఆవేదనకు ప్రతీకగా మారే ప్రమాదం ఉంది. ఉద్యోగాల పేరుతో ఆశలు రేపి, చివరకు అనుమానాల మబ్బుల్లో వాటిని వదిలేయడం ఏ ప్రభుత్వానికీ శోభనీయమైన విషయం కాదు.



# కాళేశ్వరమే కవచం

వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా కొత్త సవాళ్లను సృష్టిస్తున్న వేళ, భారతదేశం కూడా వాటి ప్రభావానికి అతీతం కాదు. ముఖ్యంగా ఎల్‌నినో వంటి వాతావరణ దృగ్విషయాలు దక్షిణాసియా దేశాలపై, అందులోనూ వ్యవసాయాధారిత రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. రాబోయే కాలంలో ఎల్‌నినో ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ వంటి రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర జలవనరుల నిర్వహణ, ముఖ్యంగా కాళేశ్వరం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టుల వినియోగం అత్యంత కీలకంగా మారుతోంది. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావంతో భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. గతంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో దేశంలోని అనేక ప్రాంతాలు కరువు పరిస్థితులను ఎదుర్కొన్నాయి. తెలంగాణలో కూడా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం, సాగునీటి కొరత, తాగునీటి సమస్యలు తీవ్రతరమయ్యాయి.

తెలంగాణ భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే, రాష్ట్రంలో చాలా ప్రాంతాలు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయి. వరుసగా ఒకటి లేదా రెండు సీజన్లలో వర్షపాతం తగ్గితే రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చెరువులు, కుంటలు, మధ్యతరహా ప్రాజెక్టులు మాత్రమే ఇలాంటి పరిస్థితులను తట్టుకోలేవు. పెద్ద మొత్తంలో నీటిని నిల్వ చేసి అవసరమైన ప్రాంతాలకు తరలించే సామర్థ్యం ఉన్న వ్యవస్థలు తప్పనిసరిగా అవసరం. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యం మరింత స్పష్టమవుతోంది. గోదావరి జలాలను ఎత్తిపోసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు కేవలం సాగునీటి వనరే కాదు; వాతావరణ అనిశ్చితులను ఎదుర్కొనే వ్యూహాత్మక మౌలిక సదుపాయం కూడా. వర్షాలు సరిగా కురవని సంవత్సరాల్లో నిల్వ చేసిన నీటిని వినియోగించి సాగును, తాగునీటి అవసరాలను కొంతవరకు భద్రపరచే అవకాశం దీనివల్ల లభిస్తుంది. అయితే ఇటీవల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం, నిర్వహణ, మరమ్మతులు, పంపుల నిర్వహణ వంటి అంశాలు రాజకీయ వివాదాల మధ్య చిక్కుకున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంపై విమర్శలు ఉండవచ్చు. ఆర్థిక వ్యయాలపై చర్చలు జరగవచ్చు. సాంకేతిక లోపాలపై ప్రశ్నలు లేవనెత్తవచ్చు. కానీ ఒకసారి నిర్మితమైన భారీ జలవనరుల వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించకుండా నిర్లక్ష్యం చేయడం రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలం కాదు.

కాళేశ్వరాన్ని రాజకీయ కళ్లజోడుతో కాకుండా జల భద్రత కోణంలో చూడాల్సిన సమయం ఇది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గితే ముందుగా దెబ్బతినేది వ్యవసాయమే. ఆ తర్వాత తాగునీటి సమస్యలు తలెత్తుతాయి. పరిశ్రమలు కూడా నీటి కొరతను ఎదుర్కొంటాయి. అలాంటి పరిస్థితుల్లో గోదావరి నీటిని నిల్వ చేసి అవసరమైన ప్రాంతాలకు తరలించే సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడం భవిష్యత్తు తరాలకు నష్టమే. వాతావరణ మార్పుల యుగంలో నీటి నిర్వహణే అభివృద్ధికి మూలాధారం. తెలంగాణ గత దశాబ్దంలో చెరువుల పునరుద్ధరణ, భారీ జల ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా కొంత నీటి భద్రతను సాధించింది. ఇప్పుడు ఆ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించడం, అవసరమైన మరమ్మతులు చేపట్టడం, పూర్తి సామర్థ్యంతో వినియోగించడం ప్రభుత్వాల బాధ్యత. రాజకీయ విభేదాల పేరుతో వాటిని పక్కనపెడితే రేపటి కరువు పరిస్థితులకు సమాధానం చెప్పడం కష్టమవుతుంది. ఎల్‌నినో హెచ్చరికలు కేవలం వాతావరణ శాస్త్రవేత్తల అంచనాలు మాత్రమే కావు; అవి పాలక వ్యవస్థలకు ముందస్తు సూచనలు. ఆ సూచనలను సకాలంలో అర్థం చేసుకుని నీటి వనరులను సమర్థంగా వినియోగిస్తే సంక్షోభాలను నివారించవచ్చు. లేకపోతే తక్కువ వర్షాలు, ఎండిపోతున్న భూగర్భ జలాలు, క్షీణిస్తున్న వ్యవసాయం, తాగునీటి కొరత వంటి సమస్యలు తెలంగాణను మళ్లీ వెనక్కి నెట్టే ప్రమాదం ఉంది. అందుకే రాబోయే రోజుల్లో కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల వినియోగం రాజకీయ అంశం కాదు; అది తెలంగాణ భవిష్యత్తు భద్రతకు సంబంధించిన అత్యవసర అవసరం.



**నవీన్ పోగుల**
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

# ఇంధన స్వావలంబనకు... కొత్త దారి

భారతదేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలు, అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడే చమురు దిగుమతులు, పెరుగుతున్న కాలుష్య సమస్యల నేపథ్యంలో ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు కొత్త ప్రత్యామ్నాయంగా ముందుకు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఎథనాల్ మిశ్రమ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల తయారీకి ప్రాధాన్యత ఇస్తోంది. అయితే ఈ సాంకేతికత గురించి సాధారణ ప్రజల్లో ఇంకా పూర్తి అవగాహన లేదు. అందుకే ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల ప్రయోజనాలు, సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలపై చర్చ అవసరం.




ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు అంటే పెట్రోల్‌తో పాటు ఎథనాల్ మిశ్రమ ఇంధనాలను కూడా వినియోగించగల వాహనాలు. సాధారణంగా ఇవి ఈ20 నుంచి ఈ85 లేదా ఈ100 వరకు ఎథనాల్ కలిగిన ఇంధనంతో నడిచేలా రూపొందించబడతాయి. వాహనంలోని సెన్సర్లు ఇంధనంలో ఎథనాల్ శాతాన్ని గుర్తించి ఇంజిన్ పనితీరును స్వయంచాలకంగా సర్దుబాటు చేస్తాయి. ఫలితంగా వాహనం ఎలాంటి ఇబ్బంది లేకుండా వివిధ రకాల ఇంధనాలతో పనిచేస్తుంది. భారతదేశం ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల వినియోగం పెరిగితే పెట్రోలియం ఉత్పత్తులపై ఆధారపడటం తగ్గి, దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది. ముఖ్యంగా దేశీయంగా ఉత్పత్తి చేసే చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి ఎథనాల్ తయారు చేయడం వల్ల రైతులకు కూడా అదనపు మార్కెట్ లభిస్తుంది. వ్యవసాయ రంగానికి ఇది ఒక గొప్ప అవకాశంగా భావించవచ్చు. చెరకు రైతులు మాత్రమే కాకుండా ఇతర ధాన్య పంటల సాగుదారులకు కూడా కొత్త ఆదాయ మార్గాలు ఏర్పడతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం పెరిగే అవకాశం ఉంటుంది. ఇంధన అవసరాలకు వ్యవసాయం కూడా భాగస్వామి కావడం ద్వారా రైతుల ఆదాయం పెరగాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఇది కొంతవరకు తోడ్పడుతుంది.

పర్యావరణ పరంగా కూడా ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎథనాల్ ఒక పునరుత్పాదక ఇంధనం. ఇది కాలినప్పుడు విడుదలయ్యే కార్బన్ ఉద్గారాలు పెట్రోల్‌తో పోలిస్తే తక్కువగా ఉంటాయి. దీంతో వాయు కాలుష్యాన్ని కొంత మేర తగ్గించవచ్చు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రపంచ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు అడుగులు వేస్తున్న ఈ సమయంలో ఫ్లెక్స్ ఫ్యూయల్ సాంకేతికత కూడా ఒక ఉపయోగకరమైన ఎంపికగా నిలుస్తోంది. అయితే ఈ మార్పు అంత సులభం కాదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎథనాల్ పంపిణీ మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు అవసరమైన ఇంధనం అన్ని ప్రాంతాల్లో లభించకపోతే ఆశించిన ఫలితాలు రావు. అందువల్ల వాహనాల తయారీతో పాటు ఇంధన సరఫరా వ్యవస్థను కూడా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇంకో ముఖ్యమైన అంశం ప్రజల్లో అవగాహన. చాలామందికి ఎథనాల్ ఇంధనం అంటే ఏమిటి, దాని వల్ల వాహన పనితీరుపై ఎలాంటి ప్రభావం ఉంటుంది, నిర్వహణ ఖర్చులు ఎలా ఉంటాయి వంటి విషయాలపై స్పష్టత లేదు. కొన్ని అపోహలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు, ఇంధన సంస్థలు కలిసి విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. వినియోగదారులకు సరైన సమాచారం అందించాలి.

ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు దేశ ఇంధన భద్రత, రైతుల ఆదాయం, పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఒకేసారి చేరుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అయితే కేవలం వాహనాలను మార్కెట్‌లోకి తీసుకురావడం సరిపోదు. ఇంధన లభ్యత, ధరల స్థిరత్వం, మౌలిక వసతులు, ప్రజా అవగాహన వంటి అంశాలపై సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. భారతదేశం ఇంధన స్వావలంబన వైపు అడుగులు వేస్తున్న ఈ సమయంలో ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలను కేవలం ఒక కొత్త సాంకేతికతగా కాకుండా భవిష్యత్తు ఇంధన వ్యూహంలో కీలక భాగంగా చూడాలి. సరైన ప్రణాళిక, సమర్థవంతమైన అమలు ఉంటే ఇవి దేశ ఆర్థికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు, రైతుల సంక్షేమానికి ఒకేసారి దోహదపడగలవు.



**శ్రీకాంత్ చుక్కల**
నిజామాబాద్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.